
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఖమ్మం

5

ఆదివారం 28 సెప్టెంబరు 2025

ప్రత్యేకం.. ఆ అనుబంధం!



- ఆప్యాయతకు చిరునామా.. కూతురి ప్రేమ
- తల్లిదండ్రులతో అనుబంధం వెలకట్టలేనిది
- నేడు అంతర్జాతీయ కుమార్తెల దినోత్సవం

7

నల్లనేల ముద్దుబిడ్డలు..



- ఏజెన్సీ ప్రాంతాల నుంచి సిరుల సింగరేణి సేవలో..
- ఒక్క ఇల్లెందు నియోజకవర్గం నుంచే ఆరుగురు జీఎంలు
- ఉన్నతోద్యోగాలతో పుట్టినగడ్డ రుణం తీర్చుకుంటున్న బొగ్గుట్ట ఆణిముత్యాలు

అది ఏజెన్సీ ప్రాంతం.. నేడంటే అభివృద్ధి చెందింది కానీ.. మునుపటి రోజుల్లో కనీస సదుపాయాలు లేని 'నల్ల నేల'. సిరులు కురిపించే సింగరేణి బొగ్గు గనుల పుట్టినిల్లు. బొగ్గుట్టగా అందరికీ తెలిసిన ఇల్లెందు సమీప గ్రామాల నుంచి నాడు ప్రాథమిక విద్య కోసం మైళ్ల దూరం నడిచిన వారెందరో. అలాంటి వారిలో నేడు కొందరు ఉన్నత విద్యావంతులుగా ఎదిగి నల్లనేల ముద్దుబిడ్డలుగా మారారు. ముఖ్యంగా ఇల్లెందు నియోజకవర్గం నుంచి ఆరుగురు కీలక అధికారులుగా ఎదిగారు. సింగరేణి సంస్థలో చేరి అంచలంచెలుగా ఎదిగి జీఎంలుగా కొనసాగుతూ సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమంలో కీలక పాత్ర పోషిస్తూ.. తాము పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటున్నారు.

\- కొత్తగూడెం టౌన్, ఆంధ్రజ్యోతి


ఎం.తిరుమలరావు సింగరేణి డైరెక్టర్ ఈ అండ్‌ఎం


వెంకన్న జాదవ్ (ఐఆర్‌టీఎస్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్


దునసరి వెంకటేశ్వర్లు సింగరేణి సివిల్ జీఎం


రామనాథం సింగరేణి ట్రాన్స్‌పోర్ట్ జీఎం


వి.రామదాసు సింగరేణి బిజినెస్ డెవలప్‌మెంట్ జీఎం


ఈసం కృష్ణ, ఇల్లెందు ఏరియా జీఎం

వివరాలు : 6లో


భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి

అన్నదాన సత్రంలో వరదనీరు

తగ్గుతూ.. పెరుగుతూ..

- భద్రాచలం వద్ద 46.6 అడుగులకు నీటిమట్టం
- నాలుగు గంటలపాటు నిలకడగా.. ఆపై తగ్గి..
- రాత్రి 10 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక ఉప సంహరణ
- నేడు మళ్లీ పెరగనున్న నీటిమట్టం
- భద్రాద్రిలో భారీ వర్షం
- దేవస్థానం అన్నదాన సత్రంలోకి వాన నీరు
- పరిశీలించిన డాక్టర్ తెల్లం, దేవస్థానం ఈవో దామోదర్‌రావు

భద్రాచలం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం గత 24 గంటలుగా క్రమేపి పెరుగుతూ గరిష్టంగా శనివారం ఉదయం 6 గంటలకు 46.6 అడుగులకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు 45.8 అడుగులున్న గోదావరి నీటిమట్టం క్రమేపి పెరుగుతూ వచ్చింది. ఈ క్రమంలో నాలుగు గంటలపాటు 46.6 అడుగుల వద్ద నిలకడగా ఉండగా 10,78,490 క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహించింది. వరద కరకట్ట వద్ద ఉన్న దేవస్థానం కల్యాణ కట్ట కిందిభాగంలోకి వరద నీరు చేరింది. స్నానఘట్టాలు నీట మునిగాయి. 12గంటలకు 46 అడుగులకు తగ్గిన గోదావరి నీటిమట్టం మూడు గంటలకు 45.2 అడుగులకు, 6 గంటలకు 44.3అడుగులకు తగ్గింది. శనివారం రాత్రి 10 గంటలకు 42.9 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికను కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఉపసంహరి స్తున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం 43అడుగులు దాటి ప్రవహిస్తుండటంతో మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ఇదిలాఉండగా గోదావరి ఉధృతంగా ప్రవహించిన క్రమంలో భద్రాచలం-చర్ల మార్గంలోని దుమ్ముగూడెం మండలం తూరుబాక వద్ద డైవర్షన్ రోడ్డు నీట మునిగింది. కాగా రాకపోకలు స్తంభించగా సాయంత్రం నుంచి పునరుద్ధరించారు. అదేవిధంగా భద్రాచలానికి సరిహద్దున ఉన్న ఏపీలోని అల్లూరి జిల్లా యటపాక మండలం మురుమూరు, పోలిపాక వద్ద రహదారిపై వరద నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే గోదావరి వరద ఉధృతి, కిన్నెరసాని ఎగపోటుతో (మిగతా 6వ పేజీలో)

'స్థానిక' రిజర్వేషన్లు ఖరారు

- తగ్గిన జనరల్ స్థానాలు
- ఆశావహుల అంచనాలు తారుమారు
- రాజకీయ భవిష్యత్‌పై ఆందోళన



ఖమ్మం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో కీలకమైన రిజర్వేషన్ల ప్రక్రియను అధికారులు పూర్తిచేశారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి రాజకీయపార్టీలతో సమావేశం నిర్వహించి రిజర్వేషన్లు వెల్లడించారు. జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలతో పాటు మండలపరిషత్ చైర్మన్ పదవులకు రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఈ పదవులపై ఆశలుపెట్టుకున్న అధికార, విపక్ష పార్టీల నాయకుల అంచనాలు తారుమారయ్యాయి. తమకు అనుకూలంగా రిజర్వేషన్లు లేవన్న విషయం తెలుసుకుని నిరాశ చెందారు. ముఖ్యంగా జనరల్‌పై ఆశలు పెట్టుకున్న వారి ఆశలు ఆవిరయ్యాయి. రిజర్వేషన్లు వెల్లడిస్తారనితెలియగానే సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. అధికారిక జాబితా వచ్చిన తర్వాత కొందరిలో ఉత్సాహం, మరికొందరిలో నిరుత్సాహం కనిపించింది. ఆశించిన దానికి భిన్నంగా రిజర్వేషన్లు రావడంతో ఆయా మండలాల్లో కొత్తనాయకులు కూడా తెరపైకి వస్తున్నారు. రిజర్వేషన్లకు అనుగుణంగా అభ్యర్థులను గుర్తించే, ప్రక్రియలో రాజకీయపార్టీలు నిమగ్నమయ్యాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో పాటు ఆయా పార్టీల జిల్లా అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, ఆర్థిక, రాజకీయ సమర్థత, కుల సామాజిక బలాన్ని దృష్టిలో ఉంచుకుని అభ్యర్థుల ఎంపికలో చర్చలు చేస్తున్నారు. కార్యకర్తల మనోభావాలు తెలుసుకుంటున్నారు.

రిజర్వేషన్లు ఇలా..

జిల్లాలో 20 జడ్పీటీసీలకు గాను ఎస్టీ జనరల్ 2, ఎస్టీ మహిళ 2, ఎస్సీ జనరల్ 2, ఎస్సీ మహిళ 2, బీసీ జనరల్ 4, బీసీ మహిళ 4, జనరల్ 2, జనరల్ మహిళ 2 దక్కాయి. ఎంపీపీల్లో ఎస్టీ జనరల్ 3, ఎస్టీ మహిళ 3, ఎస్సీ జనరల్ 2, ఎస్సీ మహిళ 2, బీసీ జనరల్ 4, బీసీ మహిళ 4, జనరల్ 2, జనరల్ మహిళకు ఒకటి రిజర్వుఅయ్యాయి. 2019లో బీసీలకు రిజర్వేషన్లలో అంతగా ప్రాధాన్యం దక్కలేదు. కానీ ఈ సారి 42శాతం రిజర్వేషన్లు రావడంతో బీసీ రిజర్వ్‌డ్ స్థానాలు పెరిగాయి.

జడ్పీటీసీ, ఎంపీపీ అధ్యక్షుల రిజర్వేషన్ల పట్టిక 8లో

జడ్పీ పీఠం.. ఎస్టీకి

రిజర్వ్ అయిన చైర్మన్ పదవి



ఖమ్మం జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ అయ్యింది. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా పరిషత్ చైర్మన్లకు రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసింది. అందులో భాగంగా ఖమ్మం జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. గతంలో ఉమ్మడి జడ్పీ పరిధిలో ఉండి.. జిల్లాల విభజనతో ఆవిర్భవించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్‌కు తొలి చైర్మన్ పదవి ఎస్టీకి కేటాయించగా.. ఈ సారి జనరల్ కేటగిరీకి ఇచ్చారు. ఇక ఖమ్మంజడ్పీ చైర్మన్ గతంలో ఎస్సీ జనరల్ కాగా ఈ సారి రొటేషన్ పద్ధతిలో ఎస్టీ జనరల్‌గా అవకాశమిచ్చారు. ఉమ్మడి జిల్లా పరిషత్ ఉన్నప్పుడు ఎస్టీ కేటగిరీలో చందాలింగయ్య, వాణీరమణారావు చైర్మన్లుగా పనిచేశారు.ఈ ఈ సారి ఖమ్మం జడ్పీ ఎస్టీకి రిజర్వ్ కావడంతో జిల్లాలోని ఎస్టీ ప్రాదేశిక నియోజకవర్గాలకు డిమాండ్ పెరగనుంది. కూసుమంచి, కొణిజర్ల ఎస్టీ జనరల్ కాగా తిరుమలాయపాలెం, సత్తుపల్లి ఎస్టీ మహిళకు కేటాయించారు. ఈ నాలుగుతో పాటు జనరల్‌కు రిజర్వ్ అయిన చింతకాని, ఏన్కూరు జడ్పీటీసీ స్థానాల నుంచి , కామేపల్లి, సింగరేణి మండలాల్లో జనరల్ మహిళకు కేటాయించారు. ఇక్కడి నుంచి కూడా ఎస్టీ అభ్యర్థులు పోటీ చేసే అవకాశం ఉంది.

మావోయిస్టుల ఆయుధ తయారీ కర్మాగారం గుర్తింపు

- యంత్రాలు, ఆయుధాలు స్వాధీనం
- ఛత్తీస్‌గఢ్ సుకుమా జిల్లా అడవుల్లో లభ్యం

7


సుకుమా పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

రేబిస్‌తో జర భద్రం

- రేబిస్ నివారణ.. ప్రతీ ఒక్కరి బాధ్యత
- జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రాణాలకే ముప్పు

నేడు రేబిస్ వ్యతిరేక దినం

7



సమావేశమైన ఎంఈవోలు (ఫైల్)

తనిఖీలు.. సమావేశాలు.. సమీక్షలు..

- పాఠశాలల పనితీరు మెరుగునకు చర్యలు
- విద్యాశాఖపై కలెక్టర్ అనుదీప్ ప్రత్యేక దృష్టి
- సెలవు రోజుల్లో భేటీలు, రివ్యూలతో యంత్రాంగం బిజీబిజీ
- ప్రతీ విద్యార్థిలో కనీస సామర్థ్యాల సాధనే లక్ష్యంగా ముందడుగు

6

నేలకొండపల్లి బౌద్ధ క్షేత్ర అభివృద్ధికి కార్యాచరణ చేపట్టండి

- త్వరితగతిన మాస్టర్ ప్లాన్ ఖరారు చేయాలి
- నెలలోపు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి
- పురావస్తుశాఖ సంచాలకుడు ప్రొఫెసర్ అర్జున్‌రావుకు కలెక్టర్ అనుదీప్ సూచనలు

ఖమ్మం కలెక్టరేట్ /నేలకొండపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల్లో నేలకొండపల్లి బౌద్ధ క్షేత్ర అభివృద్ధి కార్యచరణ ప్రారంభించాలని పురావస్తుశాఖ సంచాలకుడు ప్రొఫెసర్ అర్జున్‌రావుకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. శనివారం నేలకొండపల్లిలో బౌద్ధ స్థూప సందర్శన అనంతరం ప్రొఫెసర్ అర్జున్ రావు ఖమ్మం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నేలకొండపల్లి బౌద్ధక్షేత్ర అభివృద్ధిపై అర్జున్‌రావుకు పలు సూచనలు చేశారు. మాస్టర్‌ప్లాన్ ను ఖరారు చేసి నెల రోజులలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బౌద్ధక్షేత్రంలోని సంరక్షణ పనులు చేపట్టడానికి రూ.50లక్షలను రాష్ట్ర పురావస్తు శాఖకు అప్పగించామన్నారు.

బౌద్ధస్థూపాన్ని సందర్శించిన అర్జున్‌రావు

తొలుత రెవెన్యూ శాఖ మంత్రి ఆదేశాల మేరకు పురావస్తు శాఖ సంచాలకుడు ప్రొఫెసర్ కె.అర్జున్ రావు నేలకొండపల్లి బౌద్ధక్షేత్రాన్ని సందర్శించారు. బౌద్ధక్షేత్రం వద్ద పురావస్తు, పర్యాటక శాఖలు చేపడుతున్న సంరక్షణ పనులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో బౌద్ధ క్షేత్రం, మహాస్థూప విహారాలు, చైత్యాలు బయలు పడిన విధానాన్ని గుర్తించారు. పనులు ఎక్కడ చేపట్టాలని పరిశీలించారు. ఈ బౌద్ధ క్షేత్రంలోని పురావస్తు శాఖ 1970 నుంచి 1990 వరకు అనేక దఫాలుగా తవ్వకాలను చేపట్టారని, ఈ తవ్వకాల్లోని మహాస్థూప చిత్రాలు, విహారాలు వీటితో పాటు కాయిన్స్ బిట్స్ బుద్ధ విగ్రహాలు (మిగతా 6వ పేజీలో)


బౌద్ధస్థూపం వద్ద పురావస్తుశాఖ సంచాలకుడు అర్జున్‌రావు, అధికారులు




ముఖ్యమంత్రి సందేశాన్ని వింటున్న కలెక్టర్, అధికారులు

నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- వర్చువల్ పద్ధతిలో 'ఏటీసీ'ని ప్రారంభించిన సీఎం
- ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్

6

భద్రాద్రి జిల్లాలో భారీవర్షం

» లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి చేరిన వరద
» రహదారులపై నిలిచిన రాకపోకలు.. మునిగిన పంటలు


నీటమునిగిన దుమ్ముగూడెం పర్ణశాల నారచీరల ప్రాంతం

కొత్తగూడెం / ఖమ్మం , సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి భారీ వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువులు, వాగులు, వంకలు పొంగి పొర్లాయి. రహదారులపైకి నీరు నీరు రావడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పంటపొలాలు నీట మునిగాయి. జిల్లాలో సగటున 4.73సెం.మీ వర్షపాతం నమోదవగా అత్యధికంగా చర్ల మండలంలో 13.72సెం.మీ వర్షపాతం నమోదైంది. దుమ్ముగూడెం, కరకగూడెంలో 8.02, అశ్వాపురంలో 7.86, బూర్గంపాడులో 7.26, ఆళ్లపల్లిలో 6.96, పాల్వంచలో 5.96, భద్రాచలంలో 5.84, కొత్తగూడెంలో 5.34, ఇల్లెందులో 4.86, లక్ష్మీదేవిపల్లిలో 4.68, గుండాలో 3.9, జూలూరుపాడులో 3.78, చుంచుపల్లిలో 3.24, పినపాకలో 3.16, మణుగూరులో 2.62, సుజాతనగర్‌లో 2.42, అశ్వారావుపేటలో 1.46, దమ్మపేటలో 1.04 సెం.మీ వర్షపాతం నమోదైంది. కాగా బూర్గంపాడు మండలంలో గోదావరి వరద ఉధృతితో పాటు కిన్నెరసాని వాగు ప్రవాహం ఎగపోటుతో బూర్గంపాడు శివారులో పంట పొలాలు మునిగిపోయాయి. బూర్గంపాడు నుంచి సోంపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కరకగూడెం మండలంలో పలు గ్రామాల్లో వర్షపు నీరు ఇండ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఎస్సీ వాడలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. భద్రాచలం రామాలయం ఉచిత నిత్య అన్నదాన సత్రంలోకి వాననీరు చేరింది. దానితోపాటుగా చప్టా దిగువలోని పరిసరాల్లో వర్షపునీరు చేరింది. దుమ్ముగూడెంలో పర్ణశాల నారచీరల ప్రాంతం నీట మునిగింది. రహదారిపైకి నీళ్లు చేరాయి. తాలిపేరు 24 గేట్లు ఎత్తి 30వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని ప్రాజెక్టుకు పెద్దఎత్తున వరద నీరు చేరుతోంది.

ఖమ్మం జిల్లాలో ముసురు వాన

ఖమ్మం జిల్లాలో రెండురోజులుగా ముసురువర్షం పడుతోంది. ఈ వర్షాలతో పత్తి పంటకు వర్షం కారణంగా పూతరాలడం, కాయనల్లబడం లాంటివి జరిగి పత్తి నాణ్యతపై ప్రభావం చూపుతుందని రైతులు చెబుతున్నారు. ఖమ్మం జిల్లాలో 13.2మి.మీ సగటు వర్షపాతం శనివారం ఉదయం నమోదైంది. అందులో అత్యధికంగా కామేపల్లిలో 50.2మి.మీ., సింగరేణి 38.2మి.మీ., కల్లూరు 30.2మి.మీ., ఏన్కూరు 24.0మి.మీ., రఘునాథపాలెం 15.2మి.మీ., చొప్పున వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో కూడా 5నుంచి 8మి.మీ., వర్షపాతం నమోదైంది.

నేడు ఆనందోబ్రహ్మ కామెడీ హంగామా

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నేడు నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో మొగిలి ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో ఆనందో బ్రహ్మ కామెడీ హంగామా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మొగిలి గుణకర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం నిర్వహించే ఈ కార్యక్రమంలో జబర్దస్త్, డ్రామా జూనియర్ కళాకారులతో పలు కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సంతోష్ డ్యాన్స్ అకామీ వారిచే డ్యాన్స్‌లు బేబీ సుప్రజచే భరతనాట్యం, మిమిక్రీ సుధాకర్‌చే మిమిక్రి, తోపాటు మరెన్నో హస్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం నగర ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నల్ల నేల.. ముద్దు బిడ్డలు

» ఏజెన్సీ ప్రాంతాల నుంచి సిరుల సింగరేణి సేవలో..
» ఇల్లెందు నియోజకవర్గం నుంచి ఆరుగురు జీఎంలు

సండే స్పెషల్ SUNDAY SPECIAL

కొత్తగూడెం టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కనీస సదుపాయాలు లేని ఏజెన్సీ గ్రామాల్లో పుట్టి.. ప్రాథమిక విద్య కోసం మైళ్ల దూరం నడిచి వెళ్లి.. కష్టాలకోర్చి.. కన్నీళ్ల దిగమింగి ఉన్నత చదువులు చదివి తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తల్లితండ్రులు నిరక్షరాస్యులైనా తమ ఆకాంక్షలు, లక్ష్యాలను నెరవేర్చుకుని నల్ల నేల ఆణిముత్యాలుగా ఎదిగిన సింగరేణి అధికారులుగా కొలువులు చేపట్టారు. సింగరేణి పుట్టినిల్లైన ఇల్లెందు సమీపం నుంచి కింది స్థాయి ఉద్యోగులుగా సింగరేణి సంస్థలో చేరి అంచెలంచెలుగా ఎదిగి సింగరేణి జీఎంలుగా కొనసాగుతూ సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇల్లెందు నియోజకవర్గంలోని వివిధ మారూమూల గ్రామాల నుంచి వచ్చిన అధికారులు సింగరేణి జీఎంలుగా పరిపాలన కొనసాగిస్తున్నారు. ఇల్లెందు నియోజకవర్గం నుంచే ఆరుగురు సింగరేణి జీఎంలుగా కొనసాగుతున్నారు.

● ఇల్లెందు మండలం కట్టుగూడెం గ్రామానికి చెందిన మోకాళ్ల తిరుమలరావు సింగరేణిలో ఏఈగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగి సింగరేణి ఈఅండ్‌ఎం డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఎలాంటి కుటుంబ నేపథ్యం లేకుండా ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా సింగరేణిలో కీలక బాధ్యతలు నిర్వహించే స్థాయికి ఎదిగారు.

● దనియాలపాడు గ్రామానికి చెందిన ధనసరి వెంకటేశ్వర్లు సింగరేణి సివిల్ జీఎంగా విధులు నిర్వహిస్తున్నారు. తండ్రి సర్పంచ్‌గా పని చేసినా రాజకీయాలవైపు వెళ్లకుండా ఉన్నత విద్యనభ్యసించి సింగరేణిలో వివిధ హోదాల్లో పనిచేస్తూ సివిల్ జీఎంగా కొనసాగుతున్నారు.

● సుదిమళ్ల గ్రామపంచాయతీకి చెందిన మెస్స రామనాథం సింగరేణిలో ట్రాన్స్‌పోర్ట్ జీఎంగా విధులు నిర్వహిస్తున్నారు. సుదిమళ్ల గ్రామం నుంచి ఇల్లందులోని సింగరేణి పాఠశాల వరకు కాలినడకన ప్రయాణించి ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని కోల్‌కతాలో ఇంజనీరింగ్ పూర్తి చేసి సింగరేణిలో చిరు ఉద్యోగిగా జీవితం ప్రారంభించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ జీఎంగా సేవలందిస్తున్నారు.

● ఇల్లందు మండలం భాగ్యనగర్ తండాకు చెందిన వాంకుడోత్ రామదాస్ సింగరేణిలో బిజినెస్ డెవలప్మెంట్ జీఎంగా విధులు నిర్వహిస్తున్నారు. మారుమూల గిరిజన గ్రామామమైన భాగ్యనగర్ తండా నుంచి ప్రాథమిక విద్యను కారేపల్లిలో పూర్తి చేసినా ఉన్నత విద్యను హైదరాబాద్‌లో పూర్తి చేసి సింగరేణిలో జీఎంగా కొనసాగుతున్నారు.

ఇల్లెందు పట్టణంలోని జేకే కాలనీకి చెందిన చెందా లక్ష్మీనారాయణ సింగరేణి సెక్యూరిటీ జీఎంగా పనిచేస్తున్నారు. సింగరేణి ఉద్యోగి తనయుడుగా ఆ ప్రాంతంలో ఉన్నత విద్యను అభ్యసించి సింగరేణిలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు.

● ఇల్లెందు నియోజకవర్గంలోని గార్ల మండలంలోని మర్రిగూడేనికి చెందిన వెంకన్నజాదవ్ సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి ఐఆర్‌టీఎస్ అధికారిగా ఎంపికై సింగరేణిలో కోల్‌మూవ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ విజిలెన్స్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. కేంద్ర సర్వీస్‌లో 2010లో ఎంపికైన వెంకన్న జాదవ్ అస్సాం, పశ్చిమబెంగాల్, బిహార్ రాష్ట్రాల్లో వివిధ హోదాలలో పని చేసి ఇటీవల సింగరేణికి డిప్యూటేషన్‌పై వచ్చారు.

● టేకులపల్లి మండలంలోని చింతోని చెలక గ్రామానికి చెందని ఈసం కృష్ణ ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సింగరేణి పుట్టినిల్లైన ఇల్లెందు ప్రాంతం నుంచి ఆరుగురు ఉన్నతాధికారులు సింగరేణికి సేవలందించడం గమనార్హం.



నాన్న స్ఫూర్తితోనే సేవా కార్యాక్రమాలు

● ధనసరి వెంకటేశ్వర్లు, సింగరేణి సివిల్ జీఎం

నాన్న సర్పంచ్‌గా పనిచేస్తూ గ్రామాభివృద్ధికి శ్రమించారు. ఆయన స్ఫూర్తితో గ్రామంలో విద్యార్థుల చదువుల కోసం పాఠశాలతో పాటు దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నావంతు శ్రమిస్తా. చదువుతోనే అభివృద్ధి సాధ్యం. ఉన్నత విద్యను చదివేందుకు మా ప్రాంత యువతలో అవగాహన కల్పిస్తా.

జన్మభూమి రుణం తీర్చుకుంటా...

●వెంకన్న జాదవ్, (ఐఆర్‌టీఎస్)

సింగరేణి కోల్‌మూమెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

నా తల్లితండ్రులు నిరక్షరాస్యులు. అయినా నన్ను చదివించాలనే పట్టుదల ఉండేది. కష్టపడి చదువుకుని ఐఆర్‌టీఎస్ స్థాయికి ఎదిగాను. కేంద్ర సర్వీసులో పనిచేసినా సింగరేణికి డిప్యూటేషన్‌పై రావడం ఈ ప్రాంతానికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా. భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తా.

పేద విద్యార్థులకు సహకరిస్తున్నా

● రామనాథం, సింగరేణి ట్రాన్స్‌పోర్ట్ జీఎం

పేద విద్యార్థులకు సహకరిస్తున్నా. వారి చదువులకు అవసరమైన ఆర్థిక సాయం అందజేస్తున్నాం. యువత ఉన్నత చదువులపై అవగాహన పెంచుకుని కాంపిటీషన్ పరీక్షలకు సిద్ధం కావాలి. వారికి అవసరమైన సహకారం అందిస్తాం.

ఉన్నత చదువులపై అవగాహన కల్పిస్తున్నాం..

● వి.రామదాసు, సింగరేణి బిజినెస్ డెవలప్మెంట్ జీఎం

నేను ఎన్నో ఇబ్బందులు పడి చదువుకున్నా. అందుకే చదువు విలువ గురించి యువతకు చెప్పే ప్రయత్నం చేస్తున్నాం. ఉన్నత చదువులు చదివే వారికి నా వంతు సహకరిస్తున్నా. గ్రామంలో డాక్టర్లు, ఇంజనీర్లుగా ఎదిగాలనుకున్న వారికి నాకు తోచినంతలో అవగాహన కల్పించా. కల్పిస్తున్నా.

గ్రామాభివృద్ధికి సహకరిస్తున్నా...

● మోకాళ్ల తిరుమలరావు, సింగరేణి డైరెక్టర్ ఈఅండ్‌ఎం

నేను పుట్టిన కట్టుగూడెం గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్నా. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తా. సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం కృషి చేస్తా. గ్రామ రుణం తీర్చుకుంటా.

హక్కుల సాధన కోసం మాలలు ఐక్యంగా ఉద్యమించాలి

» మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

జూలూరుపాడు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):హక్కుల సాధన కోసం మాలలు ఐక్యంగా ఉద్యమించాలని, అందరూ కలసిమెలసి ముందుకు సాగాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. శనివారం ఆయన జూలూరుపాడు రాగా సంఘం నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. మాలమహనాడు అధ్వర్యంలో నవంబరు 2వతేదీన హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మాలల రణభేరి మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు సూచనలకు విరుద్ధంగా 2011 జనాభా లెక్కలతో సరైన ఎంపరికల్ డేటా లేకుండా కులాల వారీగా చేసిన ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రోస్టర్ పాయింట్ల కేటాయింపును పున:సమీక్షించి జీవో 99ని సవరించి మాలలతో పాటు గూప్-3లో ఉన్న మరో 25 కులాలకు న్యాయం చేయాలన్నారు. హైదరాబాద్‌లో జరిగే మాలల రణభేరి మహాసభకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఇది ఇలా ఉండగా మండలంలో మాలమహనాడులో రెండు వర్గాలు ఉండడంతో ఒక వర్గం నాయకులు కార్యక్రమ నిర్వహణపై తమకు సమాచారం ఇవ్వలేదని, తాము మాలలం కాదా అని ఆయన్ను నిలదీశారు. దీంతో ఇరు వర్గాల మధ్య వివాదం నెలకొంది. ఆయన వారిని సముదాయించినప్పటికీ ఫలితం లేకపోవడంతో సమావేశంలో పాల్గొనకుండానే వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల శివకుమార్, మందా రంజిత్, పణితి గోపాలకృష్ణ, పుల్లయ్య, కాంతారావు, కమలాకర్, వెంకటేశ్వర్లు, రామారావు, వీరస్వామి తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య

పట్టుదలతో చదివా.. ఉద్యోగం సాధించా..

» పేదలకు సేవలందించటమే నా లక్ష్యం
» గ్రూప్ 1లో సత్తా చాటి డిప్యూటీ కలెక్టర్ కొలువు కొట్టిన మురళి



ఖమ్మం అర్బన్ సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : 'కష్టాలంటే ఏంటో నాకు బాగా తెలుసు. పేదల సమస్యలెన్నెన్నో అంతకన్నా తెలుసు. కష్టాలను జయించాలంటే చదువొక్కటే మార్గం అని బలంగా నమ్మా. ఎన్ని ఆటంకాలు, అవరోధాలు ఎదురైనా మొక్కవోని దీక్షతో చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించా. విధి నిర్వహణలో పేదలకు సేవ చేయటం, ఉద్యోగ పరంగా నా విధులను సక్రమంగా నిర్వహించటం నాధ్యేయం' అని ఖమ్మానికి చెందిన మద్దినేని మురళి పేర్కొన్నారు. గ్రూప్ 1లో సత్తా చాటి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన పేదింటి విద్యాకుసుమం మురళి.. తన కలలను సాకారం చేసుకుంటూ శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి ఉద్యోగ నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ఫోనులో ముచ్చటించారు. ఉన్నత ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో ఇతర ఉద్యోగాలువచ్చినప్పటికీ వాటితో సంతృప్తి చెందకుండా అనుకున్నలక్ష్యం దిశగా కృషి చేశానన్నారు. ఖమ్మం యూపీహెచ్ కాలనీలోని అతిపేద కుటుంబానికి చెందిన తనను చిన్నతనంనుంచి అనేక కష్టాలు చుట్టుముట్టినా వాటికి వెరవకుండా చదువుపై దృష్టి సారించానని చెప్పారు. తనతండ్రి ఆటో డ్రైవర్ అని ఆయన తన చిన్నతనంలోనే చనిపోయారని, తనతల్లి ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌లో ఒప్పంద కార్మికురాలిగా పనిచేసేదని వివరించారు. ఆమె అనారోగ్యం పాలైతే చికిత్సకోసం తమకున్న ఒక చిన్న ఇంటినీ అమ్మేయాల్సి వచ్చిందని, క్రైస్తవ మైనార్టీ విద్యాలయాల సాయంతో చదువుకున్నానని చెప్పారు. దూరవిద్యద్వారా ఎంబీఏ పూర్తి చేశానని, అయినవారు సైతం ఆదుకోని పరిస్థితుల్లో అత్యంత దుర్భర స్థితిని ఎదుర్కొన్నానని చెప్పారు. పోటీపరీక్షలకు సిద్ధమై 2018లో టీజీఎస్పీ కానిస్టేబుల్‌గా, 2020లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యానన్నారు. 2024లో టీజీపీ ఎస్సీ గ్రూప్ ఫలితాల్లో జూనియర్ అకౌంటెంట్‌గా కొలువు సాధించి ఖమ్మం నగర పాలక సంస్థలో పనిచేస్తూనే గ్రూప్ వన్ పరీక్షలు రాశానని చెప్పారు. ఎవరైనా పట్టుదలతో చదివితే పేదరికం అవరోధం కాబోదని, ఎలాంటి పరిస్థితులకైనా వెనకడుగువేయకుండా శ్రమించి చదువుల్లో రాణించాలని విద్యార్థులకు తానిచ్చే సూచనని మురళి పేర్కొన్నారు.

తగ్గుతూ.. పెరుగుతూ..

(5వ పేజీ తరువాయి)

బూర్గంపాడు నుంచి సోంపల్లి వెళ్లే రహదారిపై వరద నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పంట పొలాల్లో సైతం నీరు చేరింది. ఇదిలా ఉండగా ఆదివారం గోదావరి నీటిమట్టం మళ్లీ పెరిగే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.


వర్షపు నీటిలో చప్టా దిగువ ప్రాంతం

చప్టా దిగువ ప్రాంతంలో భారీగా చేరిన వర్షపునీరు

భద్రాచలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. 4సెం.మీ. వర్షపాతం నమోదు కావడంతో ఆ ప్రభావం కారణంగా భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానానికి చెందిన ఉచిత నిత్యాన్నదాన సత్రంలోకి వర్షపు నీరు చేరింది. అలాగే రామాలయ పరిసరాల్లోని చప్టా దిగువ ప్రాంతంలో సైతం వర్షపునీరు భారీగా రావడంతో స్థానికులు ఇబ్బందుల పాలయ్యారు. గోదావరి వరద కరకట్ట వద్ద ఉన్న మోటార్లను ఆన్ చేసి భారీగా వర్షపు నీటిని గోదావరిలోకి వదిలారు. దేవస్థానం నిత్యాన్నదాన సత్రంలోకి వర్షపునీరు చేరడంతో సిబ్బంది వర్షపు నీటిని బయటకు పంపి సత్రంలో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు రామాలయ పరిసర ప్రాంతాల్లో పర్యటించి వర్షపునీటిలో మునిగిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ ఈఈ ఎస్కే జానీతో మాట్లాడి వర్షపు నీరు, మురుగునీరు వెంటనే మోటార్లతో తోడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే భద్రాద్రి దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు సైతం అన్నదాన సత్రం, విస్తా కాంప్లెక్సు, ఆలయ పరిసరాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు.


భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం

నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు

» కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మంఖానాపురంహవేలి సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మనకు మంచి నైపుణ్యం ఉంటే ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభిస్తాయని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏటీసీ కేంద్రాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. ఖమ్మం టేకులపల్లిలోని ఐటీఐ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధునాతన సాంకేతిక కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏటీసీ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు మంచి శుభవార్త చెప్పారని, వచ్చే సంవత్సరం నుంచి ఏటీసీలలో చేరిన ప్రతి విద్యార్థికి నెలకు రూ.2 వేలు స్టైపండ్ అందించడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుత ఏటీసీ కేంద్రం ద్వారా అందించే నైపుణ్య కోర్సులు, అందుబాటులో ఉన్న పరికరాలు ప్రపంచస్థాయితో పోటీ పడేలా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఐటీఐ -ఏటీసీ కోర్సుల పట్ల ఏవైనా అపోహలు ఉంటే తొలగించాలని, భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా కోర్సులను డిజైన్ చేశామన్నారు. ఏటీసీ కోర్సులను పక్కాగా నేర్చుకొని మన నైపుణ్యాలను పెంచుకుంటే నెలకు రెండు నుంచి మూడు రూ.లక్షల వరకు కూడా సంపాదించే అవకాశం లభిస్తుందని, మంచి స్కిల్ ఉన్న వర్కర్ల కోసం పరిశ్రమలు ఎంతైనా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాబోయే పదేళ్లలో దేశంలో చాలా వరకు ఎలక్ట్రిక్ వాహనాలు మాత్రమే అందుబాటులో ఉంటాయని, అటువంటి వాహనాల మెకానిక్స్‌పై నైపుణ్య శిక్షణ ఒక కోర్సు ద్వారా అందిస్తున్నామన్నారు. మనం డిగ్నిటీ ఆఫ్ లేబర్‌ను గౌరవించాలని, నైపుణ్యం ఉపయోగించి చేసే ఏ పని తక్కువ కాదన్నారు. ప్రస్తుతం చైనా నుంచి ప్రపంచానికి ఎక్కువగా ఉత్పత్తి పరికరాలు ఎగుమతి అవుతున్నాయని, మన దగ్గర కూడా ఉత్పత్తి రంగంలో నైపుణ్య శిక్షణ పెరిగితే డిమాండ్ లభించే మంచి ఆదాయం లభిస్తుందన్నారు. మన ఇంటి దగ్గరే పని దొరకాలని అనుకుంటే జీవితంలో ఎటువంటి ఎదుగుదల ఉండదన్నారు. ఇంటర్ తర్వాత బిట్స్ పిలాని కాలేజీలో సీటు వచ్చినప్పుడు ఎందుకు దూరం పోవాలని ఆలోచిస్తే నేడు కలెక్టర్ అయ్యేవాడిని కాదన్నారు. మనం చేసిన నైపుణ్య కోర్సులకు అనుసంధానంగా మరింత పరిజ్ఞానం పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. విజ్ఞానం ఎక్కడినుంచి దొరికినా తెలుసుకోవాలని, కళాశాలలో చెప్పిన దానికి అదనంగా మన వంతు ప్రయత్నంగా విజ్ఞానం పొందేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, కార్మిక సహాయ కమిషనర్ కృష్ణవేణి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, సంబంధిత అధికారులు, శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తనిఖీలు.. సమావేశాలు.. సమీక్షలు..

» పాఠశాలల పనితీరు మెరుగునకు పకడ్బందీ చర్యలు
» విద్యాశాఖపై కలెక్టర్ అనుదీప్ ప్రత్యేక దృష్టి
» సెలవురోజుల్లో భేటీలు, రివ్యూలతో యంత్రాంగం బిజీబిజీ
» ప్రతీ విద్యార్థిలో కనీస సామర్థ్యాల సాధనే లక్ష్యంగా ముందడుగు


బోనకల్‌లో శనివారం జరిగిన సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు

బోనకల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గతంలో పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుతో పాటు బోధన, పరీక్షల నిర్వహణ అంతా మాన్యువల్‌గా జరిగేది. ఈ ఏడాది విద్యాశాఖకు సంబంధించి సమూల మార్పులు జరగడంతో అంతా ఆన్‌లైన్ మయంగా మారింది. పాఠశాలల్లో అమలయ్యే కార్యక్రమాలను ఎప్పటికపుడు ఆన్‌లైన్లో అప్‌డేట్ చేస్తున్నారు. టీచర్లను కూడా అప్‌డేట్ చేస్తూ డిజిటలైజేషన్ ప్రక్రియలో భాగం చేశారు. పాఠశాలల వారీగా విద్యార్థుల నమోదు, ప్రగతి వివరాలను పొందుపరుస్తున్నారు.

తనిఖీలకు ఆదేశాలు..

పాఠశాలల పనితీరును మెరుగుపరిచేందుకు గాను పకడ్బందీగా తనిఖీలు చేయాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలల్లో సమర్థవంతంగా ఫండమెంటల్ లిటరసీ, న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్), లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(ఎల్ఐపీ)లను పక్కాగా అమలు చేసేందుకు తనిఖీలు చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా జిల్లా విద్యాశాఖాధికారులు నెలలో 12 నుంచి 16 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను తనిఖీ చేయాలి. జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్లు 20 నుంచి 24 పాఠశాలలను, ఎంఈవోలు 20 నుంచి 24 పాఠశాలలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు 16 నుంచి 20 పాఠశాలలను తనిఖీ చేయాలి. బడుల్లో అమలవుతున్న కార్యక్రమాల నిర్వహణతో పాటు బోధనను పరిశీలించి ప్రత్యేకమైన యాప్‌ల్లో తనిఖీ బృందం పరిశీలించిన అంశాలను నమోదు చేయనున్నారు.

సెలవు రోజుల్లో సమావేశాలు, సమీక్షలు

పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించినా, విద్యాశాఖకు సంబంధించి చేయాల్సిన కార్యక్రమాల కార్యాచరణ గురించి ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు సమావేశాలను నిర్వహిస్తున్నారు. పాఠశాలల వారీగా పెండింగ్ అంశాల గురించి సమీక్షలు చేస్తున్నారు. బడుల్లో ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థుల ముఖ హాజరు వివరాలను నమోదు చేయాలి. స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో ఎండీఎమ్ సమాచారాన్ని పెట్టాలి. పరీక్షల్లో సాధించిన మార్కులు, పెరెంట్ మీటింగ్ వివరాలను కూడా యాప్‌ల్లో నమోదు చేస్తున్నారు. రోజూ కలెక్టర్ యాప్‌ల ద్వారా పాఠశాలకు ఎంతమంది టీచర్లు వస్తున్నారు? సెలవుల్లో ఎవరున్నారు? అనధికారికంగా గైర్హాజరైన వారి వివరాలను పర్యవేక్షిస్తున్నారు. ఉపాధ్యాయుల్లో జవాబు దారీ తనం పెంచేందుకు గానూ పకడ్బందీ చర్యలకు శ్రీకారం చుట్టారు.

విద్యాశాఖపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి



కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల ముఖ హాజరు(ఎఫ్ఆర్ఎస్) యాప్ నిర్వహణలో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న ప్రతీ విద్యార్థికి ఆధార్ అప్‌డేట్, అపార్ జనరేట్ చేసేందుకు గానూ కలెక్టర్ ప్రత్యేక చొరవతో ఎంఆర్సీలల్లో ఆధార్ నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆధార్ అప్‌డేట్‌తో పాటు అపార్ జనరేట్ చేసే ప్రక్రియను వచ్చే నెల 20వ తేదీ కల్లా పూర్తి చేయాలని గడువు విధించారు. ఆధార్‌లో తప్పులున్నా, వాటిని సరి చేసేందుకు ఆర్డీవో, తహసీల్దార్ల సహకారం అందించేలా వారిని భాగస్వామ్యం చేశారు. పాఠశాలల్లో ప్రతీ విద్యార్థి ఎలా చదువుతున్నాడో తెలుసుకునేందుకు కలెక్టర్ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెస్తున్నట్టు సమాచారం.

ప్రతీ విద్యార్థి చదవాలన్న లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమం..

పాఠశాలలకు వచ్చిన ప్రతీ విద్యార్థి చదవడం, రాయడం, గుర్తించడం లాంటి సామర్థ్యాల సాధనే లక్ష్యంగా దసరా సెలవుల తరువాత బడుల్లో రోజూ గంట పాటు చదివించే కార్యక్రమాన్ని అమలు చేసేందుకు తగిన ఉత్తర్వులను జారీ చేశారు. ఇందుకు సంబంధించి ఎంఈవోలు ఉపాధ్యాయులకు సమావేశాలను నిర్వహించి దిశానిర్దేశం చేశారు. పనిదినాల్లో ప్రతిరోజు సాయంత్రం 3గంటల నుంచి 4గంటల వరకు రైమ్స్, కృత్యాల నిర్వహణ చేపట్టే వివరాలను ఉపాధ్యాయులకు పంపారు. పాఠశాలకు వచ్చే ప్రతీ విద్యార్థి చదువు వివరాలను ఎప్పటికపుడు యాప్‌లో అప్‌లోడ్ చేస్తూ వెనుక బడిన వారిని ముందుకు తీసుకెళ్లేలా కలెక్టర్ టీచర్లపై గురుతర బాధ్యతను పెట్టారు.

నేలకొండపల్లి బౌద్ధ క్షేత్ర అభివృద్ధికి కార్యాచరణ చేపట్టండి

(5వ పేజీ తరువాయి)

బయటపడ్డాయన్నారు. ఫస్టు బీసీ నుంచి ఫోర్త్ సెంచరీ, శాతవాహన ఇక్ష్వాకుల విష్ణు కుండినుల కాలాలకు, శాతవాహన ఇక్ష్వాకు విష్ణు కుండినులకు సంబంధించి ఆ తవ్వకాల్లో బయట పడిన వస్తువులను అన్నిటిని కూడా ఒక సైట్ మ్యూజియంగా ఈ బౌద్ధక్షేత్రం దగ్గర ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులను అర్జున్ రావు ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేలకొండపల్లి బౌద్ధస్తూపం ఆసియాలోనే అతి పెద్దదని, శాతవాహనుల కాలంలోదని, ఇలాంటి పురాతన కట్టడాలను ఆర్కియాలజీ విభాగం పరిరక్షిస్తుందన్నారు. ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. తాను ఖమ్మం జిల్లాకు చెందిన వాడినని, బౌద్ధస్తూపం అభివృద్ధితో ఖమ్మం జిల్లా పేరు ప్రఖ్యాతులను ప్రపంచవ్యాప్తంగా విస్తరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ బౌద్ధస్తూపం ప్రాముఖ్యత, చరిత్ర భావితరాలకు గుర్తుండేలా కృషి చేస్తానన్నారు. ఈ స్తూపాన్ని సందర్శించేందుకు వచ్చే పర్యాటకులకు చరిత్ర గురించి వివరించేందుకు ప్రైవేటు భాగస్వామ్యంలో వరంగల్ జిల్లాలో ఉన్న అనుభవజ్ఞులైన గైడ్స్‌ను ఇక్కడికి నియమిస్తామన్నారు. ఈ ప్రాంతంలో మౌలిక సౌకర్యాలను కల్పిస్తామని, టూరిజం శాఖ సహకారంతో అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. రెండు, మూడు నెలల్లో బౌద్ధస్తూపం ఆవరణను సుందరీకరిస్తామన్నా రు. చుట్టుపక్కల నుంచి ఎక్కడి నుంచి చూ సినా బౌద్ధ స్తూపం కనిపించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రొఫెసర్ అర్జున్‌రావు వెంట ఉప సంచాలకులు పి.నాగరాజు, నర్సింగ్ సహాయ సంచాలకులు బుజ్జి, జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.


బౌద్ధస్తూపం వద్ద అధికారులు

ప్రత్యేకం.. ఆ అనుబంధం!



- ఆప్యాయతకు చిరునామా.. కూతురి ప్రేమ
- తల్లిదండ్రులతో అనుబంధం వెలకట్టలేనిది
- నేడు అంతర్జాతీయ కుమార్తెల దినోత్సవం

చుంచుపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సృష్టిలో అమ్మ ప్రేమ తరువాత తోబుట్టువుల తో పాటు అంతటి ఆత్మీయత పంచేది కేవలం కూతురే.. ఇంట్లో అన్నిటిపై అజమాయిషీ చేస్తూ ప్రేమానురాగాలు అధికంగా పొందేది కూడా కూతురు మాత్రమే. అందుకే ఆ అను 'బంధం'.. ప్రతీ ఇంట్లో ప్రత్యేకమే. ఏ ఇంట్లో కూతురు ఉంటుందో ఆ ఇల్లు ఉల్లాస భరిత వాతావరణాన్ని కలిగించడమే కాకుండా సందడిగా ఉంటుందన్న పెద్దల పలుకు అక్షరాలా నిజం. ఈ ప్రేమానురాగాలు పుట్టింటికి దూరమైన కూతురికి ప్రతీ నిత్యం పెంచేవే కానీ.. తగ్గించేది కావు. ఆదివారం అంతర్జాతీయ కుమార్తెల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

కుమార్తెల బంధం మరువలేనిది

భారతదేశ సంస్కృతీ సాంప్రదాయాలలో కుమార్తెల బంధాలు, ఆత్మీయతలు వెలకట్టలేనివి. తెలుగు క్యాలెండర్‌లో ప్రతీ సంవత్సరం.. ప్రతీ నెలా.. ప్రతిరోజూ ఏదో ఒక ప్రత్యేకత అనేది సాధారణంగా ఉంటుంది. అందులో ప్రత్యేకంగా సెప్టెంబరు నెలకు మరింత ప్రత్యేకత సంతరించుకుంది. ముఖ్యంగా డాటర్స్ డే అనేది ఉందని, అతి తక్కువ మందికి మాత్రమే తెలుసు. ఈ ప్రపంచంలో ఎన్ని బంధాలున్నప్పటికీ.. కూతురు బంధం చాలా అందమైనది.. బాధ్యత కలిగి ఉన్న బంధం. ఒకే ఇంట్లో చిన్నప్పటి నుంచి తిట్టుకుంటూ.. కొట్టుకుంటూ పెరిగి పెద్దవారవుతారు. సోదర సోదరీలు.. సోదరీమణులు పెద్దయ్యాక మాత్రం ఒక్కసారిగా మారిపోతారు. చాలా ప్రేమగా, ఆప్యాయత, అనురాగాలను పంచుకుంటారు. అందుకే మదర్స్ డే, ఫాదర్స్ డే, సిస్టర్స్ డే, డాటర్స్ డేలను ప్రపంచ వ్యాప్తంగా ఆ బంధాలకు అంకితం ఇచ్చారు.

ప్రేమానురాగాలను పంచే కూతుళ్లు

భారతదేశంలో ప్రతి ఏటా సెప్టెంబరు 28వ తేదీన డాటర్స్ డే జరుపుకుంటాము. అదే ఈ రోజున కుమార్తెలకు వారి ప్రత్యేకత తెలియజేస్తూ కుటుంబ సభ్యులు ఏదో రకంగా అభినందనలు తెలుపుతారు. తమ జీవితంలో కూతురు ఎంత ముఖ్యమో వారికి చెప్పే ప్రయత్నం చేస్తారు. ఇలాంటివన్నీ చెప్పడానికి ఒక్కరోజు సరిపోకపోయినా.. వారి కోసం ప్రత్యేకంగా ఏదైనా చేయడంతో వారిపై ఎంత ప్రేమ ఉందో వ్యక్తం చేస్తారు.ప్రతీ ఒక్కరికీ కూతురు లేకపోతే తోబుట్టువులు, కజిన్స్‌తో కూడా ఈ వేడుకలను జరుపుకుంటున్నారు.

కూతురు ఉన్న గృహం ఆనంద నిలయం

కూతురు ఉన్న గృహం ఆనంద నిలయంగా మారుతుంది. అందుకే ఇంట్లో కుటుంబసభ్యులే జీవితాంతం నీకు మేమున్నాము.. అనే అండను గుర్తు చేస్తూ భరోసా కల్పించాలి. వారితో ప్రతి ఒక్కరూ ఒక ప్రత్యేకమైన బంధాన్ని కలిగి ఉండాలి. అదేవిధంగా ఈ ప్రపంచంలో ఏ ఇద్దరు కుమార్తెలు ఒకేలా ఉండరని గ్రహించాలి. వారి ఇష్ట ఇష్టాలు, అభిరుచులు, అలవాట్లు, ప్రేమ.. ఇతర విషయాలన్నింటిలో వారి ఆసక్తులు వేర్వేరుగా ఉంటాయనేది సత్యం. తొలిరోజుల్లో బాగా కొట్టుకున్నప్పటికీ.. భవిష్యత్‌లో ఒకరంటే ఒకరు బాగా ఇష్టపడతారు.. కలిసిపోతారు. అదే కుమార్తెలకు ఉన్న ప్రత్యేకత.

ఆ అనుబంధం వర్ణించలేనిది

తండ్రితో కూతురి అనుబంధం వెలకట్టలేనిది. ఎన్ని బాధలు, బాధ్యతలు, భారాలు ఉన్నా.. ఒక కంట తండ్రిని కనిపెట్టుకుంటూ.. యోగక్షేమాలు స్మరించుకుంటు ఉండే సృష్టిలో అపురూపమైన పదం కుమార్తె. డాటర్స్ డే రోజున ఎన్ని పనులున్నప్పటికీ.. తల్లిదండ్రులు వారితో గడిపేందుకే ఆసక్తి చూపి స్నేహంగా.. ఆప్యాయంగా గడపాలి. వీలైతే వారితో కలిసి లాంగ్ ట్రిప్‌కు వెళ్లి సమయాన్ని కేటాయించాలి. మనందరి స్నేహితులను కూడా వారి కుమార్తెలను ప్రేమగా,ఆపాయ్యంగా చూసుకోవాలని తెలియజేస్తూ కుమార్తెల బంధాన్ని బలపరచాలని కోరాలి.

రేబిస్‌తో జర భద్రం



- రేబిస్ నివారణ.. ప్రతీ ఒక్కరి బాధ్యత
- జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రాణాలకే ముప్పు
- నేడు రేబిస్ వ్యతిరేక దినం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : శునకం.. ఈ పేరు వింటేనే ఇంట్లో మనతో పాటు మరో వ్యక్తి అనే అభయం. నోరు లేని జీవుల్లో అతి విశ్వాసం కలిగిన జంతువు. ఇంటికి యజమాని ఎంత ముఖ్యమో రెండో యజమానిగా శునకంగా అభివర్ణిస్తారు. ముఖ్యంగా పెంపుడు శునకాల్లో వ్యాక్సిన్లు క్రమం తప్పక వేయించాల్సిన అవసరం యజమానులపై ఉంది. వ్యాక్సిన్లు వేయని సమయాల్లో శునకంతో చనువుగా ఉంటూ దాని లాలాజలం మనిషికి తగిలితే.. కొన్ని ఆరోగ్యకరమైన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. దాని పన్ను, గోరు గీరుకున్నా.. తప్పనిసరిగా మనిషికి వ్యాక్సిన్ వేయించాలి. శునకం కాటుకు, గాయానికి వ్యాక్సిన్ వేసుకోని పక్షంలో.. ఆ వ్యక్తికి రేబిస్ వ్యాధి సోకి చివరికి మృతి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఆదివారం రేబిస్ వ్యతిరేక దినం సందర్భంగా ప్రత్యేక కథనం..

రేబిస్.. ఇది ఒక వైరస్

రేబిస్ వ్యాధి పిచ్చి కుక్క కాటు వల్ల సంక్రమించే సూక్ష్మజీవి(వైరస్) కుటుంబం. ఆర్ఎన్ఏ వైరస్ వల్ల కలిగే సంక్రమిత వ్యాధుల్లో రేబిస్ అతి భయంకరమైన, ప్రాణాంతకమైన వ్యాధి. ఈ వ్యాధి వ్యాప్తి వైరస్ శరీరంలో ఎక్కువగా కాటు లేదా గోకడం వల్ల ప్రవేశిస్తుంది. ఈ వ్యాధి సోకిన శునకాలు మనుషులు, పశువులను ఇతర శునకాలను కరవడం వల్ల ఈ క్రిములు శరీరంలోకి ప్రవేశించి వ్యాధిని కలగజేస్తాయి. ఈ వ్యాధి సోకిన వారికి దాదాపు మరణం తప్పదని వైద్య ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

రేబిస్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గాయాన్ని సబ్బుతో ప్రవహించే నీటిలో సుమారు 15 నిమిషాల పాటు కడగాలి. ఎట్టి పరిస్థితుల్లో కట్టుతో కప్పరాదు. వైద్యుడి సలహా మేరకు టీకాలు వేయించుకోవాలి. రేబిస్ జబ్బుతో మృతి చెందిన జంతువులను కాల్చడం.. లేదా గుంటలు తీసి పూడ్చం చేయాలి. శునకం ఉండే పరిసరాలను దాని లాలాజలం, వివిధ ప్రాంతాలను క్రిమి సంహారక మందులతో తరచూ శుభ్రం చేయాలి.

నివారణపై అవగాహన తప్పనిసరి

రేబిస్ వ్యాధిపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించడం చేయాలి. వ్యాధి ఎలా వ్యాప్తి చెందుతుంది. వ్యాధి తీవ్రత లక్షణాలు శునకం కాటుకు గురైన సందర్భంలో తీసుకోవాల్సిన వ్యాధి నిరోధక, నిర్మూలన చర్యలను ప్రజలకు తెలియజేస్తూ అవగాహన కల్పించాలి. వ్యాక్సినేషన్ ప్రోత్సహించడం.. పెంపుడు జంతువులకు ముఖ్యంగా శునకాలు టీకాలు వేయడం.. రేబిస్ నివారించడంలో ముఖ్యమైన అంశం. ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని ప్రతీ ఏడాది సెప్టెంబరు 28వ తేదీన నిర్వహిస్తున్న సందర్భంగా జంతు యజమానులు, వారి పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాల్సి ఉంటుంది. రేబిస్‌ను నిర్మూలించేందుకు డబ్ల్యూహెచ్‌వో, వివిధ స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి. ప్రజలకు వీలైనంత మేర అవగాహన కల్పిస్తున్నాయి.

వ్యక్తిగత జాగ్రత్త తప్పనిసరి

డాక్టర్ జి.ఆనంద్‌రావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్



ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలో 3201 పెంపుడు శునకాలు ఉన్నట్లు అధికారికంగా లెక్కలు ఉన్నాయి. వీటన్నిటికీ క్రమం తప్పకుండా ప్రతీ ఏడాది ఇంటి యజమానులు వ్యాక్సిన్లు వేయించాలి. గత మూడేళ్లలో జిల్లాలో 13070 మంది శునకాల దాడిలో గాయపడిన బాధితులు ఉండగా, వారిలో ముగ్గురు మృతి చెందినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలో ప్రధాన రహదారులపై, స్థానిక నివాసాల పరిసరాలలో గుంపులు గుంపులుగా శునకాలు సంచరిస్తూ బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో మహిళలు, గృహిణిలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై వెళ్లే వాహనదారులు పాదచారులు, ప్రజలందరూ శునకాల ఉన్న ప్రాంతాల వైపు వెళ్లకుండా వివిధ జాగ్రత్తలను తీసుకోవాలి. కొన్ని ప్రాంతాల్లో శునకాలు పలు వురిపై దాడి చేస్తూ తీవ్రంగా గాయపరిచిన సంఘటనలు కూడా నమోదు అవుతున్నాయి.

కేటీపీఎస్ విస్తరణకు కేంద్ర ప్రభుత్వ సహకారం అందిస్తాం

ఎంపీ రఘురామరెడ్డికి కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి శ్రీపాద్ లేఖ

ఖమ్మం అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) విస్తరణకు కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన సహకారం అందిస్తామని కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ నాయక్ ఖమ్మం ఎంపీ రఘురామరెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు. కేటీపీఎస్‌లో రెండు యూనిట్ల విస్తరణకు, ఆధునికీకరణకు ప్రోత్సాహం అందించాల్సిందిగా కోరుతూ ఎంపీ రఘురామిరెడ్డి పార్లమెంటు సమావేశాలలో భాగంగా గత ఆగస్టు 20వ తేదీన 377వ నిబంధన కింద లేవనెత్తిన అంశానికి కేంద్ర ప్రభుత్వం స్పందించింది.. ఈమేరకు కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ నాయక్ సానుకూలత వ్యక్తం చేస్తూ ఎంపీకి లేఖ రాశారు. పాత కేటీపీఎస్ స్టేషన్ వద్ద అందుబాటులో ఉన్న స్థలంలో రెండు 800 మెగావాట్ల యూనిట్ల స్థాపనకు నివేదిక సిద్ధం చేయాల్సి ఉండగా తెలంగాణ రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ టీజీ జెన్కోకు సూచించారని నివేదిక రావాల్సి ఉందని పేర్కొన్నారు. విస్తరణకు టీజీ జెన్కో నిధులు సమకూరుస్తుందని, కేంద్రప్రభుత్వ పర్యావరణ అనుమతులు సులభతరం చేస్తుందని, అలాగే బొగ్గుకేటాయింపులకు కేంద్రం అవసరమైన మద్దతు ఇస్తుందని కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి తెలిపారు.

రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేద్దాం

● **ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి**

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఆత్మ కమిటీ పనిచేస్తుందని, అందుకు అందరం సమిష్టిగా కృషి చేద్దామని ఆత్మకమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు అన్నారు. అశ్వారావుపేటలోని రైతు వేదికలో నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన ఆత్మకమిటీ తొలి సమావేశం శనివారం జరిగింది. చైర్మన్ సుంకవల్లి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో చైర్మన్ వీరభద్రరావు మాట్లాడుతూ రైతు వేదికలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. రైతువేదికలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను గుర్తించి ఇస్తే నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. రైతులు నూతన సాంకేతిక పద్ధతుల్లో వ్యవసాయం చేసేలా కమిటీ సభ్యులు చూడాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమానికి నిరంతరం పాటుపడుతుందని, దేశంలోనే ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. రైతుభరోసా ద్వారా 48,305 మంది రైతులకు రూ.91.91 కోట్లు జమ అయ్యాయని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఆత్మ కమిటీ ద్వారా కృషిచేస్తామని తెలిపారు. ఏడీ రవికుమార్ మాట్లాడుతూ.. డివిజన్‌లో 64శాతం మంది గిరిజన రైతులు ఉన్నారని, 1,88,079 ఎకరాల్లో వివిధ రకాల పంటలు పండుతున్నాయని తెలిపారు. రైతుబీమా ద్వారా 2024-25 సంవత్సరంలో 215మంది రైతులు వివిధ కారణాలతో చనిపోగా వారికి రూ.5లక్షల చొప్పున రూ.10.75 కోట్లు చెల్లించటం జరిగిందన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారులు శివరాం ప్రసాద్, వినయ్, ఏఈవోలు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, ఉద్యానశాఖ అధికారులు రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుంకవల్లి వీరభద్రరావు

దసరా వేళ కార్మికులకు సింగరేణి షాక్

- ఓసీ కార్మికుల బదిలీలు
- ఆందోళనలో కార్మికులు

ఇల్లెందు టౌన్, సెప్టెంబరు27 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి యాజమాన్యం దసరా పండుగ వేళ ఓసీ కార్మికులకు షాక్‌నిచ్చింది. శనివారం కార్మికులను బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో కార్మికులంతా అవాక్కయ్యారు. రెండు నెలల ఓసీ కాలాన్ని పొడిగిస్తున్నట్లు గత వారంలోనే ప్రకటించిన యాజమాన్యం.. వారం గడిచిన తర్వాత బదిలీలు చేయడం కార్మికుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. 18 మంది ఆపరేటర్లను మందమర్రి ఏరియాకు డిప్యూటేషన్ వేయగా, 35 మంది కార్మికులను ఇతర ఏరియాలకు బదిలీలు చేయడంతో కార్మికులు పండుగ వేళ కుటుంబాలకు దూరం అవుతున్నామంటూ ఆవేదన చెందుతున్నారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న జేకే ఓసీ ప్రారంభం అయ్యే వరకూ ప్రస్తుతం జేకే ఓసీ కార్మికులను బదిలీలు చేయకుండా ఉండాలని గతంలోనే యాజమాన్యం హామీ ఇచ్చినప్పటికీ జేకే ఓసీ ఏర్పాటు ఆలస్యం అవుతున్న తరుణంలో బదిలీలు చేసినట్లు సింగరేణి అధికారులు ప్రకటించారు. వరుస పండుగల వేళ ఇతర ప్రాంతాలకు బదిలీలు చేయడంతో కార్మికులు షాక్ తిన్నట్లైంది. ఇల్లెందు ఏరియా యాజమాన్యం మొండి వైఖరి అవలంభిస్తున్నట్లు ఓసీ కార్మికులు తీవ్రంగా ధ్వజమెత్తారు. గుర్తింపు కార్మికసంఘం, ప్రాతినిధ్య సంఘాలకు యాజమాన్యం ఇచ్చిన హామీని విస్మరించడం సరికాదని కార్మికులు వాపోతున్నారు.



పింజరమడుగు గ్రామ చిన్న చెరువులో మృతి చెందిన చేపలు

చేపల చెరువుపై విష ప్రయోగం

- వేల సంఖ్యలో చేపలు మృతి.. ఆందోళనలో మత్స్యకారులు
- కన్నెత్తి చూడని మత్స్య శాఖాధికారులు

కామేపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కామేపల్లి మండలం పింజరమడుగు గ్రామ చిన్న చెరువులోని చేపలు మృత్యువాత పడ్డాయి. శనివారం ఉదయం చెరువులోని చేపలు వేలాది సంఖ్యలో చనిపోయి నీటిపై తేలియాడగా.. మరికొన్ని ఒడ్డుకు చేరాయి. పింజరమడుగు చెరువు చేపల సొసైటీలో జీవనోపాధి పొందుతున్న 46 మత్స్యకార కుటుంబాలు అక్కడికి చేరుకొని వాటిని చూసి ఆందోళనకు గురయ్యాయి. ఏదైనా విష ప్రయోగం చేస్తేనే ఇలా చనిపోయతాయని భావించారు. అయితే రెండు, మూడు రోజులు క్రితం పెద్ద చెరువులో పింజరమడుగు తండకు చెందిన ఓ ముగ్గురు వ్యక్తులు చేపల దొంగతనం చేయగా.. మత్స్యకారులు వారిలో ఓవ్యక్తిని పట్టుకొని నిలదీశారు. దీంతో మరోసారి ఇలాంటి పనులు చేయబోమని చెప్పి కొంత నష్టపరిహారం చెల్లించారు. ఈ విష ప్రయోగం వారే చేశారన్న అనుమానంతో సొసైటీ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మత్స్యశాఖ అధికారులకు సొసైటీ సభ్యులు సమాచారం ఇచ్చినా.. వారు చెరువు వైపు కన్నెత్తి కూడా చూడలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసులు చేపల చెరువును పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. .. ఈ విష ప్రయోగం వారే చేశారా!? లేక ఏదైనా వాతావరణ మార్పుతో మృతి చెందాయా!? అన్న విషయం తెలియని పరిస్థితి. చనిపోయిన చేపలను, నీటి నమూనా ల్యాబ్‌కు పంపిస్తే ఎలా చనిపోయాయని నిర్ధారణకు వస్తాయని మత్స్యకారులు చెబుతున్నారు. కాగా.. ఈ ఘటనతో రూ. 5లక్షల ఆస్తినష్టం వాటిల్లింది.

నమ్మించి మోసగించిన కేసులో ఒకరి అరెస్టు

ఖమ్మంక్రైం, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌లో ట్రేడింగ్‌లో డబ్బులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి డబ్బులు కాజేసిన కేసులో ఓ వ్యక్తిని అరెస్టుచేసినట్టు సైబర్ క్రైం డీఎస్పీ ఆర్‌వీ ఫణిందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లి మండలానికి చెందిన ఓ సివిల్ ఇంజనీర్‌కు రంగారెడ్డి జిల్లా మణికొండలో నివాసం ఉంటున్న లక్కిరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి అనే వ్యక్తి గతంలో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో డబ్బులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి రూ.11లక్షలు మోసం చేశాడు. ఈకేసులో రూ.2లక్షలు లక్కిరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి అకౌంట్‌కు వెళ్లడంతో.. అతడిని మణికొండలో శనివారం సైబర్‌క్రైం పోలీసులు అరెస్టుచేసి ఖమ్మంకు తీసుకువచ్చారు. అనంతరం ఖమ్మంలో కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ ఆర్‌వీ ఫణిందర్ తెలిపారు.

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సీపీ

ఖమ్మంక్రైం, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ సునీల్ దత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు వరద ఉధృతితో ప్రమహిస్తుండంతో నీటిని దాటే ప్రయత్నం చేయొద్దన్నారు. సెల్ఫీల కోసం నీటి వద్దకు వెళ్లొద్దన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు స్థానిక పోలీసులకు, పోలీసుకంట్రోల్ రూం 871265911 కు లేదా కలెక్టర్ ఆఫీస్ 9063211298కు సమాచారం అందించాలని కోరారు.

మణుగూరు కోర్టు ఆవరణలో వైభవంగా బతుకమ్మ వేడుకలు

మణుగూరు , సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మణుగూరు కోర్టు ఆవరణలో శనివారం సాయంత్రం బతుకమ్మ వేడకలను నిర్వహించారు. మణుగూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఏర్పాటు చేయగా మణుగూరు కోర్టు న్యాయాధికారి కంబపు సూరిరెడ్డి, గౌరి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బతుకమ్మలకు న్యాయవాదులతో కలసి పూజలు చేశారు. బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆటలు ఆడి పాడారు. ఇతర న్యాయవాదులు కోర్టు సిబ్బంది చిన్నారులు కూడా నృత్యం చేశారు. దీంతో కోర్టు ప్రాంగణంలో పండుగ సందడి కనిపించింది. మహిళా న్యాయవాదులు రెట్టింపు ఉత్సాహంతో బతుకమ్మ ఆటలు ఆడి పాటలు పాడారు. దీంతో స్థానికంగా సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్దం శ్రీనివాసరెడ్డి , న్యాయవాదులు చిర్రా రవికుమార్, వలసాల శైలజ, కందిమళ్ల నర్సింహారావు, జాడి చొక్కారావు, చిర్రా సరస్వతి, వీరంకి పద్మావతి, సంధ్య సావిత్రి, సునీత, విజయ్, అంకం సర్వేశ్వరరావు, నగేష్ కుమార్, మేదర మెట్ల శ్రీనివాసరావు, గద్దల సాంబ, వెంకటరత్నం, నాగార్జున రెడ్డి, రమేష్, కోర్టు సిబ్బంది వెంకటేశ్వర్లు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ వేడుకల్లో మణుగూరు న్యాయాధికారి దంపతులు

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం



కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని లకారం ట్యాంక్ బండ్ వద్ద జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా పర్యాటక శాఖ ఘనంగా వేడుకలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బతుకమ్మ వేడుకల్లో మహిళలు పాల్గొని సందడి చేశారు. ఈ వేడుకల్లో జిల్లా పర్యాటక అధికారి సుమన్ చక్రవర్తి, వివిధ శాఖల అధికారులు, కళాకారులు పాల్గొన్నారు.

తాలిపేరుకు భారీ వరద

24 గేట్లు ఎత్తివేత

చర్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్ పాటు చర్ల మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో అప్రమత్త మైన అధికారులు శనివారం ఉదయం ప్రాజెక్టు 24 ఎత్తి 30వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గత రెండు రోజులుగా చర్ల మండలంలో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. చర్ల, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని వాగులు పొంగి పొర్లుతున్నాయి. భారీగా వస్తున్న వరదతో ప్రాజెక్టు నీటి మట్టం గణనీయంగా పెరుగుతోంది. వరదనీటిని అంచనా వేస్తున్న అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ప్రస్తుత నీటి మట్టం 72.50 మీటర్లు కాగా, ఇన్‌ఫ్లో 30 వేల క్యూసెక్కులుగా ఉందని ఉందని డీఈ తిరుపతి తెలిపారు.

మావోయిస్టుల ఆయుధ తయారీ కర్మాగారం గుర్తింపు


- యంత్రాలు, ఆయుధాలు స్వాధీనం
- ఛత్తీస్‌గఢ్ సుకుమా జిల్లా అడవుల్లో లభ్యం

చర్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా అడవుల్లో శనివారం మావోయిస్టు పార్టీకి చెందిన ఆయుధ కర్మాగారాన్ని కేంద్ర బలగాలు గుర్తించాయి. సుకుమా జిల్లా అడవుల్లో మెటగూడా అడవుల్లో మావోయిస్టులు ఆయుధాలు తయారీ చేస్తున్నట్లు బలగాలకు సమాచారం అందింది. దీంతో కోబ్రా 203 బలగాలు కూబింగ్ చేపట్టాయి. మొట్టగూడ కొండల్లో ఆయుధ కర్మాగారాన్ని గుర్తించాయి. భూమి లోపల ఉన్న నిర్మాణంలో ఆయుధాలు తయారీ చేసే యంత్రాలు, ఇతర పరికరాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఇప్పటి వరకు ఇంత పెద్ద మొత్తంలో ఇలాంటి కర్మాగారం చూడలేదని, మావోయిస్టులు భారీ విధ్వంసం చేయడానికి పథకం వేసి.. ఇంత పెద్ద మొత్తంలో ఆయుధాలు తయారీ చేస్తున్నారని బలగాలు పేర్కొన్నాయి. బలగాలను చూసి మావోయిస్టులు పరారయ్యారని, వారి కోసం కూబింగ్‌ను ముమ్మరం చేశామని సుకుమా జిల్లా పోలీసులు తెలిపారు.



ఆయుధాల తయారీ యంత్రాలు

బతుకమ్మ ఘాట్‌లలో ఏర్పాట్లు పక్కాగా చేయండి



ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ ఘాట్లలో అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు శనివారం సంబంధిత అధికారులను ఆదేశించారు. బతుకమ్మ వేడుకలకు హాజరయ్యే మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు పారిశుద్ధ్య పనులను మెరుగుపరచాలని కోరారు. ప్రధానంగా సద్దుల బతుకమ్మ రోజు ముర్రేడు వాగు ఘాట్‌కు వచ్చే మహిళలకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రధాన కూడళ్లలో మహిళలు బతుకమ్మలు ఆడుకునే విధంగా ఏర్పాటు చేయాలని పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.



గంజాయిని దహనం చేస్తున్న పోలీసులు

200కిలోల గంజాయి దహనం

తల్లాడ, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): ఖమ్మం పోలీసు కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీసుస్టేషన్లలో పట్టుబడిన సీజ్‌చేసిన రెండువందల కిలోల ఎండు గంజాయిని శనివారం తల్లాడ మండల గోపాలపేట గ్రామంలో ఉన్న ఎడబ్ల్యుఎం కన్సల్టెన్సీ బర్నింగ్ ప్లాంట్‌లో పోలీసు అధికారులు దహనం చేశారు. ఖమ్మం వన్‌టౌన్, టుటౌన్, త్రీటౌన్, ఖమ్మంరూరల్, కూసుమంచి, వీఎంబంజర, కారేపల్లి పోలీసుస్టేషన్ల పరిధిలో 18కేసుల్లో పట్టుబడిన నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించివారి వద్ద నుంచి 200కిలోల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివిధ పోలీసుస్టేషన్లలో నిలవ ఉన్న గంజాయిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గెజిట్ నోటిఫికేషన్‌ల ఆధారంగా సీపీ సునిల్‌దత్ నేతృత్వంలో గంజాయిని దహనం చేశారు. ఈకార్యక్రమంలో టాస్కుఫోర్సు సీఐ స్వామి పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

దమ్మపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన మండలంలోని చిన్నగొల్లగూడెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నగొల్లగూడెం గ్రామానికి చెందిన చిమటా ప్రసాద్(45) అనే వ్యక్తి మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది ఈనెల 24న రాత్రి గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఇంటికి వెళ్లి చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే అతనికి స్థానికంగా చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం అర్ధరాత్రి ప్రసాద్ చనిపోయాడు. మృతుడి సోదరుడు చిమటా అప్పారావు ఫిర్యాదు మేరకు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తిరుమలాయపాలెం, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ అందించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫార్సుతో మంజూరైన చెక్కులను ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బెల్లం శ్రీను, మాజీ ఎంపీపీ మంగిలాల్, నాయకులు ఆర్.అరవిందరెడ్డి, తాటికొండ కిరణ్, గుర్రాల శ్రీనివాసరెడ్డి, దూదిమట్ల వెంకట్, జడ ల నగేష్ ఉన్నం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి

» ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



బీసీ నాయకుడు లక్ష్మీనారాయణకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

కామేపల్లి, సెప్టెంబరు 27: పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణ లక్ష్మి అని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శనివారం కామే పల్లి రైతువేదికలో పలువురికి కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం లో పేదల కోసం ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు ఖర్చు చేస్తుందని అన్నారు. బీసీ రిజర్వేషన్ 42శాతం అమలు చేస్తామని చెప్పి జీవో జారీ చేశామని అన్నారు. అనంతరం ముచ్చర్లలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక విక్రయకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పీ.వీర భద్రం, బావ్‌సింగ్, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో రవీందర్, నాయ కులు నల్లమోతు లక్ష్మయ్య, బొడ్డు లక్ష్మీనారాయణ, జగన్నాథరెడ్డి, సరిరాం, జర్పుల లక్ష్మణ్, దొడ్డ వేణు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మంఖానాపురంహవేలి/ఖమ్మంచర్చికాంపౌండ్/ఖమ్మం అర్బన్/ ఖమ్మం స్పోర్ట్స్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు అవిరళ కృషి చేసిన అలుపెరగని పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. నగరం లోని లకారం ట్యాంక్ బండ్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా ఖమ్మం జిల్లా అభ్యు దయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ ఇండోర్ హాల్ పరిశీలన



మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం స్పోర్ట్స్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్‌ప టేల్ స్టేడియంలో నిర్మాణం పూర్తి కావచ్చిన టేబుల్ టెన్నిస్ ఇండోర్ హాలును శనివారం నగర మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సంద ర్శించారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల కల్లా హాలును పూర్తి స్థాయిలో సిద్ధం చేసేందుకు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఇంకేమైనా పనులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదే శించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, టేబుల్ టెన్నిస్ అసోసి యేషన్ అధ్యక్షుడు బాలసాని విజయ్‌కుమార్, సెక్రటరీ ఓలేటి సాంబ మూర్తి, అథ్లెటిక్స్ కోచ్ గౌస్ తదితరులు ఉన్నారు.

కంప్యూటర్ పరికరాల అందజేత

ఖమ్మం అర్బన్ సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాపటపలి పంచా యతీ కార్యాలయానికి గ్రామానికి చెందిన కొనకంచి వెంకటప్పయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు శనివారం కంప్యూటర్ ఉపకరణాలు వితరణ చేశారు. కంప్యూటర్ తోపాటు స్కానర్, ప్రింటర్, జీరాక్స్, లను కొనకంచి వెంకటప్పయ్య కుటుంబసభ్యులు బొడ్లపాటి సత్యనారాయణ, రమాదేవి, వంశీలు పంచాయతీ కార్యదర్శి నాగరాజుకు అందించారు. కార్యక్రమంలో కొనకంచి రామచంద్రయ్య, దుంపటి నగేష్, చెన్నబోయిన సైదులు, కొనకంచి వెంకటేశ్వర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



కంప్యూటర్ ఉపకరణాలు అందిస్తున్న దృశ్యం

ఫిర్యాదు మీ వంతు...

పరిష్కారం మా వంతు

» పబ్లిక్ మరుగుదొడ్లు, పార్కుల వద్ద ఫిర్యాదులకు క్యూఆర్ కోడ్‌ల ఏర్పాటు

ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం అభివృద్ధితో పాటుగా ప్రజా ఉపయోగం గా ఉండే పబ్లిక్ సౌకర్యాలపై కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఖమ్మం నగరంలో జూన్ 2 నుంచి సెప్టెంబరు 10వరకు వంద రోజుల ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు పూర్తి చేశారు. నగరంలోని 60 డివిజన్లలో గ్యాంగ్ వర్క్ పనులు చేప ట్టారు. ఒక్కో డివిజన్‌ను జల్లెడ పట్టి పారిశుధ్య పనులు చేశారు. దీంతో ఇటీవల కురి సిన భారీ వర్షాలకు నగరం లోని ముఖ్యమైన వీధులు వెంట వరద ప్రవాహం ఎక్కువ సేపు నిల్వ ఉండ లేదు. డివిజన్లు వారీగా గ్యాంగ్ వర్క్‌లు చేపట్టడంతో ప్రధానమైన డ్రైయినేజీలు, కాల్వలు పరిశుభ్రంగా మారాయి.

స్వచ్ఛతా హీ సేవా 2025లో భాగంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు ఖమ్మం నగరంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టారు. ఇందులో లకారం ట్యాంక్ బండ్ క్లీనింగ్, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన ర్యాలీ, ప్రభుత్వ టేకులపల్లి ఐటీఐ కాలేజీలో స్పెషల్ డ్రైవ్, ఓపెన్ ప్లాట్‌లు క్లీనింగ్, విలీన ప్రాంతాల్లోనే చెత్త శుభ్రం కార్యక్రమాలను ప్రత్యేక కార్యాచరణతో నిర్వహి స్తున్నారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిష నర్ అనిల్ పర్యవేక్షణ చేస్తున్నారు.

నగరంలో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్స్, పార్కు లు, అభివృద్ధి పనులపై ఆన్‌లైన్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణకు కేఎంసీ కమిషనర్ ఫిర్యాదు మీ వంతు.. పరి ష్కారం మా వంతు అంటూ ఫిర్యాదుల క్యూఆర్ కోడ్ లను ఏర్పాటు చేశారు. నగరంలోని 33 పార్కులు, పబ్లిక్ టాయిలెట్స్ ప్రజలకు కనిపించేలా ఏర్పాటు చేశారు. స్థానికంగా ఉన్న సమస్యలతో పాటుగా పబ్లిక్ టాయి లెట్స్ పార్కుల నిర్వాహణపై ఫిర్యాదులు సూచనలు సలహాలు ఇవ్వటానికి మొబైల్ ద్వారా స్కానింగ్ ఫిర్యా దులు స్వీకరణకు శ్రీకారం చుట్టారు..



ప్రజాభిప్రాయ సేకరణ కోసం..

● అభిషేక్ అగస్త్య, కమిషనర్

నగరంలో ఆధునీకరణతో పాటుగా అందంగా ఆహ్లాదంగా ఉంచేందుకు ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతు న్నాం. ప్రజలు కేఎంసీ కార్యాలయం వరకు రాకుండానే సమీపంలోనే ఉన్న పార్కు, పబ్లిక్ టాయిలెట్స్ వద్దకు వెళ్లి క్యూ ఆర్ కోడ్‌ను మొబైల్ స్కానింగ్ చేసి ఫిర్యాదులు చేయవచ్చు. సూచనలు, సలహాలు ఇవ్వోచ్చు. ప్రతి ఫిర్యాదుకు సమాధానం తిరిగి ఇవ్వడం జరుగుతుంది.





పార్కు, మరుగుదొడ్ల వద్ద ఫిర్యాదుల నమోదుకు ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్

బౌద్ధస్తూపాన్ని సందర్శించిన ఆర్టీఐ కమిషనర్

నేలకొండపల్లి, సెప్టెంబరు27(ఆంధ్ర జ్యోతి): ఆర్టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాస రావు శనివారం ఆసియాలోనే అతి పెద్ద దైన నేలకొండపల్లి బౌద్ధ స్తూపాన్ని సంద ర్శించారు. బౌద్ధస్థూపం ప్రాంతం మొత్తాన్ని కలియ తిరిగారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు బౌద్ధస్థూపం వివరాలను కమి షనర్‌కు వివరించారు. అనంతరం సిద్దార్థ ప్రకృతి ఆశ్రమాన్ని సందర్శించారు. కార్యక్ర మంలో జర్నలిస్టు చిర్రా రవి, తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎమ్మార్ఐ రవి, జీపీవో జానీమియా పాల్గొన్నారు.



బౌద్ధస్తూపం వద్ద అధికారులతో ఆర్టీఐ కమిషనర్ శ్రీనివాసరావు

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి: మేయర్ నీరజ



మాట్లాడుతున్న మేయర్ పునుకొల్లు నీరజ

రఘునాథపాలెం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మంచుకొండ ఎత్తిపోతల పథకంతో మండలం లోని 36 చెరువులకు మండె ఎండల్లో సాగర్ జలాలతో నింపిన మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు చేపట్టిన అభివృద్ధిని చూసి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తాను చాటాలని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ కోరారు. శనివారం చింతగుర్తిలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ శ్రేణుల సమావేశంలో మేయ ర్ పాల్గొని మాట్లాడారు. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. మండలంలో వర్షాధారంపై ఆధార పడిన వ్యవసాయ రంగం ఇప్పుడు సాగర్ జలాలతో సాగునీటి సౌకర్యం కలిగిందన్నారు. మాజీ సర్పంచి తమ్మిని నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా ఉంటున్నా రన్నారు. మందడపు మనోహర్‌రావు, యల్లంపల్లి హనుమంతరావు, కొత్త కోమరయ్య, కేతినేని సీతారామయ్య, ఆలస్యం పెద్దశ్రీను, లింగనబోయిన వెంకటేశ్వర్లు, ఆలస్యం సూరయ్య, సూతగాని గోపయ్య, పొనుగోటి సైదులు, కుర్రా రామకృష్ణ, సురబి కొండలు, ఇస్మాయిల్‌ఖాన్, బదావత్ రామా, జీడిమట్ల రాములు, సీతారాములు పాల్గొన్నారు.

జడ్పీటీసీ రిజర్వేషన్లు ఇలా..		
	2019లో	ప్రస్తుతం
ఎస్టీ జనరల్ :	కామేపల్లి , సింగరేణి	కూసుమంచి, కొణిజర్ల
ఎస్టీ మహిళ :	రఘునాథపాలెం, ఏన్కూరు	తిరుమలాయపాలెం, సత్తుపల్లి
ఎస్సీజనరల్ :	బోనకల్, మధిర	ఎర్రుపాలెం, ముదిగొండ
ఎస్సీ మహిళ :	వేంసూరు, వైరా	కల్లూరు, తల్లాడ
బీసీజనరల్ :	చింతకాని	వైరా, నేలకొండపల్లి, వేంసూరు, రఘునాదపాలెం
బీసీ మహిళ :	ముదిగొండ	బోనకల్, ఖమ్మంరూరల్, పెనుబల్లి, మధిర
జనరల్ :	తిరుమలాయపాలెం, సత్తుపల్లి, కల్లూరు, పెనుబల్లి, ఖమ్మంరూరల్	చింతకాని, ఏన్కూరు,
జనరల్ మహిళ :	కొణిజర్ల, ఎర్రుపాలెం, తల్లాడ, నేలకొండపల్లి, కూసుమంచి	కామేపల్లి, సింగరేణి
మండల ప్రజా పరిషత్ చైర్మన్ల రిజర్వేషన్లు		
ఎస్టీజనరల్ :	కూసుమంచి, ఏన్కూరు, తిరుమలాయపాలెం,	సత్తుపల్లి, పెనుబల్లి, కామేపల్లి
ఎస్టీ మహిళ :	రఘునాధపాలెం, సింగరేణి, కామేపల్లి	కొణిజర్ల, ఏన్కూరు
ఎస్సీ జనరల్ :	వేంసూరు, కల్లూరు, ఎర్రుపాలెం	ముదిగొండ, చింతకాని,
ఎస్సీ మహిళ :	మధిర, వైరా, బోనకల్	తల్లాడ, తిరుమలాయపాలెం
బీసీ జనరల్	----------	బోనకల్, ఖమ్మంరూరల్, వైరా, నేలకొండపల్లి,
బీసీ మహిళ	----------	వేంసూరు, మధిర, కూసుమంచి, కల్లూరు,
జనరల్ :	కొణిజర్ల, ముదిగొండ, తల్లాడ, చింతకాని	రఘునాథపాలెం, సింగరేణి,
జనరల్ మహిళ :	సత్తుపల్లి, పెనుబల్లి, ఖమ్మంరూరల్, నేలకొండపల్లి	ఎర్రుపాలెం

ఘనంగా శరన్నవరాత్రుల పూజలు



రాధాకృష్ణనగర్‌లో..

జిల్లాలో దేవీనవరాత్రుల వేడుకలలో భాగంగా ఐదవ రోజు శని వారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని స్తంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో 21వ వార్షిక శర న్నవరాత్రుల వేడుకలు జమ్మిబండ వద్ద వైభవంగా నిర్వహిస్తు న్నారు.. 48వ డివిజన్‌లోని ఎఫ్‌సీఐ రోడ్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. అమ్మవా రికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు, అభి షేకాలు చేపట్టారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



ఖానాపురం కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



పూజలు చేస్తున్న మేయర్ నీరజ



స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో



తిరుమలాయపాలెంలో....

గ్యాస్‌తో దహన సదుపాయాన్ని వినియోగించుకోండి

ఖమ్మం అర్బన్ సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం శ్మశాన వాటికలో అంతిమ సంస్కారాలకోసం అందుబాటులో ఉన్న గ్యాస్‌తో దహన సదుపా యాన్ని నగర వాసులు ఉపయోగించుకోవాలని హిందూ శ్మశాన వాటిక నిర్వాహణ కమిటీ కార్యదర్శి ఏ. పద్మనాభం శనివారం ఒక ప్రకటనలో తెలి పారు. కట్టెలతోదహనం కన్నా గ్యాస్‌తో తక్కువ ఖర్చుతో అంతిమ సంస్కా రాలు నిర్వహిచుకునే వీలుందన్నారు. గ్యాస్‌తో దహనం పేదకుటుంబాల వారికి పూర్తిగా ఉచితం తెలిపారు.

బతుకమ్మ వేడుకలు

బతుకమ్మ సంబరాలలో భాగంగా శనివారం ఏడవ రోజు జిల్లాలో వేపకాయల బతుకమ్మ వేడు కలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మలను పేర్చి ఆడుతూ, పాడుతూ తెలంగాణ సంస్కృతి చాటిచెప్పే విధంగా వేడుకలు నిర్వహించారు. మహిళలు, బాలికలు అధిక సంఖ్యలో హాజరై బతు కమ్మ వేడుకలలో పాల్గొన్నారు.



శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న డైరెక్టర్ శ్రీ విద్య



'ప్రియదర్శిని'లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న చైర్మన్ నవీన్



బతుకమ్మ ఆడుతున్న తలసీమియా చిన్నారులు



ఎస్‌బీఐటీలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కవి జయరాజు

కేవీకే ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

వైరా, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛత హీసేవ ర్యాలీని నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం నుంచి వైరా వరకు జాతీయ ప్రధాన రహదారిపై రెండు కిలోమీటర్లు ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టి.సుచరితదేవి, శాస్త్రవేత్తలు డాక్టర్ పావని, డాక్టర్ పణిశ్రీ, చైతన్య పాల్గొన్నారు.

కొందరికి మోదం.. మరికొందరికి ఖేదం

- స్థానిక సంస్థల రిజర్వేషన్లతో మారిన పరిస్థితి
- అనుకూల రిజర్వేషన్లతో ఆశావహుల్లో ఆనందం
- నియోకవర్గంలో ఎంపీపీ, జడ్పీటీసీ పదవులన్నీ రిజర్వుడు స్థానాలే

సత్తుపల్లి, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పలు స్థానాల రిజర్వేషన్లు పలు రాజకీయ పార్టీల నాయకుల్లో మోదం.. కొందరు నాయకులకు ఖేదం మిగిల్చాయి. గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలపై ఆశలు పెట్టుకున్న పలువురు రాజకీయ నాయకులకు రిజర్వేషన్లతో షాక్ తగిలింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్న క్రమంలో పంచాయతీ, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు అధికారులు సిఫారసు చేశారు. శనివారం రిజర్వేషన్ల జాబితా రూపొందించగా దీనిని జిల్లా కలెక్టర్ ఆమోదించి ఉత్వర్వులు జారీ చేయాల్సి ఉంది. అధికారులు సిఫారసు చేసిన రిజర్వేషన్ల జాబితా రాజకీయ పార్టీల నాయకులకు చేరింది. దీంతో సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలపై ఆశ పెట్టుకున్న అనేక మంది ప్రముఖ నాయకుల ఆశలు రిజర్వేషన్లతో గల్లంతయ్యాయి. నియోజకవర్గంలో ఐదు ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు మొత్తం రిజర్వు కావడంతో ఆయా స్థానాలపై ఆశలు పెట్టుకున్న జనరల్ కేటగిరి నాయకులు నిరాశకు గురయ్యారు. ఇదే క్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ పదవులు రిజర్వు అయిన కేటగిరిలకు సంబంధించిన నాయకులలో ఆనందోత్సాహాలు వెల్లవిరిస్తున్నాయి. ఎంపీపీ జడ్పీటీసీ పదవులకు పోటీ చేసేందుకు పలువురు ఆశావహులు రిజర్వేషన్లు తమకు అనుకూలంగా రావడంతో తమ పార్టీ నాయకత్వంపై ఆశలు పెట్టుకుంటున్నారు. పోటీచేసేందుకు తమకు పార్టీ నాయకత్వం అవకాశం ఇస్తుందని ధీమాగా ఉన్నారు. ఇదే క్రమంలో గ్రామ పంచాయితీ, ఎంపీటీసీ స్థానాల్లో కూడా పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. గ్రామ పంచాయితీ సర్పంచ్ పదవిపై ఆశలు పెట్టుకున్న నాయకులు రిజర్వేషన్లతో అవకాశం కోల్పోతుండగా రిజర్వేషన్ల ద్వారా అందివచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని ఆయా కేటగిరిల నాయకులు పోటీకి సై అంటున్నారు. ఆశావహులంతా పార్టీ నాయకత్వంపై ఆశతో ఉండగా నాయకత్వం ఏ రకంగా స్పందిస్తుందనేది నాయకులలో ఉత్కంఠ రేపుతోంది.



కల్లూరు: కల్లూరు డివిజన్ పరిధిలో గల ఆరు మండలాలకు సంబంధించి సర్పంచుల, ఎంపీటీసీల స్థానాల (మహిళ) రిజర్వేషన్లను శనివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో లాటరీ పద్ధతిపై ఖరారు చేశారు. ఈ రిజరేషన్ల ప్రక్రియ సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కల్లూరు డివిజన్ పరిధిలో ఆరు మండలాల పరిధిలో మొత్తం 155 గ్రామ పంచాయితీలు, 80 ఎంపీటీసీలు స్థానాలకు రిజర్వేషన్ల ప్రక్రియ నిర్వహించారు. డిఎల్‌పిఓ విజయలక్ష్మి, కల్లూరు తహసిల్దార్ సాంబశివుడుతో పాటుగా పలువురు అధికారులు పాల్గొన్నారు.

వార్డుల రిజర్వేషన్లు ప్రకటన..

వేంసూరు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వేంసూరు మండలంలోని 26గ్రామపంచాయతీలకు సంబంధించిన 244వార్డుల రిజర్వేషన్లను శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఎంపీడీవో రాజారావు ప్రకటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాణిక్యరావు, మండలపరిషత్ సిబ్బంది కల్పన, శాస్త్రీ, శ్రీనివాసరావు, చైతన్య పాల్గొన్నారు. ఇదిలా ఉంటే 244వార్డుల రిజర్వేషన్లను ప్రకటిస్తుండగా సెల్‌ఫోన్లలో సర్పంచ్‌ల రిజర్వేషన్లు రావడంతో రాజకీయ పార్టీల నాయకులు తమకు అనుకూలంగా లేకపోవడంతో సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఈ రిజర్వేషన్లపై అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది.

ముదిగొండ: రానున్న సర్పంచ్ ఎన్నికలకు మండలంలో 25 గ్రామపంచాయతీలకు సంబంధించి ప్రతి గ్రామంలోని వార్డు రిజర్వేషన్లను శనివారం ఖరారు చేసినట్లు ఎంపీడీవో శ్రీధర్‌స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వాల్మీకి కిషోర్, సూపరింటెండెంట్ భాస్కర్‌రావు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్ వర్కర్స్‌ను జీవో 14లో చేర్చాలి

వైరా, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలోని స్పెషల్ డ్రైవ్‌లో పనిచేస్తున్న కార్మికులను జీవో 14లో చేర్చాలని కోరుతూ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు ఆధ్వర్యంలో శనివారం అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజకు వినతి పత్రం సమర్పించారు. మునిసిపాలిటీలో గడచిన ఏడు సంవత్సరాలుగా పనిచేస్తున్న స్పెషల్ డ్రైవ్ వర్కర్లకు సరైన వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నాయకులు గాదె లక్ష్మీనారాయణ, యామాల గోపాలరావు, ఉపేందర్, రాయపూడి శ్రీను, బోళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మత్కేపల్లి మార్కెట్ కమిటీ నియామకం



చింతకాని, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చింతకాని, ముదిగొండ మండలాలకు చెందిన మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు నూతన కమిటీను ప్రభుత్వం శనివారం ప్రకటించింది. మార్కెట్ కమిటీ చైర్మన్ నాగులవంచ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు అంబటి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. డైరక్టర్లుగా పర్సగాని తిరుపతి, నర్సింశెట్టి శ్రీనివాసరావు, బందెల నాగార్జున, మట్టా బాబురామిరెడ్డి, షేక్ ఖాసీం సాహెబ్, మేకపోతుల రేవతి, వడ్డేల్లి వీరరాఘవులు, భూక్యా బాలాజీ, వెంకటప్పయ్య, కె.సత్యం గౌడ్, సింగు లక్ష్మీ, మామిళ్లపల్లి రాంబాబు, దేవరపల్లి వివేకనందరెడ్డిలు నియమించినట్లు మార్కెటింగ్ శాఖ శనివారం ఉత్తర్వులు జారీచేసింది.



వేణుగోపాల్‌కు రూ.15వేలు అందజేస్తున్న దాతలు

క్యాన్సర్ చికిత్సకు రూ.15వేల ఆర్థికసాయం

వైరా, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపూడి గ్రామంలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బంటు వేణుగోపాల్‌కు చికిత్స నిమిత్తం ఆ గ్రామానికి చెందిన పలువురు దాతలు శనివారం రూ.15వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పేద కుటుంబానికి చెందిన వేణుగోపాల్ క్యాన్సర్ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దాంతో దాతలు ముందుకొచ్చి రూ.15వేలు ఆర్థికసాయం చేశారు. భవిష్యత్‌లో కూడా తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ పెద్దభద్రయ్య, టీడీపీ నాయకులు బండి గోపాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు నర్సింహారావు, సత్యానందం పాల్గొన్నారు.

కారేపల్లిలో నేడు ఎమ్మెల్యే పర్యటన

కారేపల్లి సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పర్యటిస్తారని మండల కాంగ్రెస్ కమిటీ నాయకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని బాగ్యనగర్‌తండా, పోలంపల్లి పంచాయతీలలో జరిగే పలు అభివృద్ధి కార్యాక్రమాలతో పాటు, లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన కార్యక్రమం చేస్తారని, ఎమ్మెల్యే పర్యటన కార్యక్రమాన్ని మండల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని కమిటీ కోరింది.

సస్యరక్షణ చర్యలపై అవగాహన

ఏన్కూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో వరి, పత్తి పంటల్లో తీసుకోవల్సిన సస్యరక్షణ చర్యలను ఏవో నరసింహారావు రైతులకు వివరించారు. శనివారం జన్నారం గ్రామంలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లీటర్ నీటిని 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి మొక్కల మొదలు చుట్టూనేలపైన పోయాలన్నారు. పంట తక్షణ రికవరీ కోసం 13-0-45 (మల్టీకే) 5-10-గ్రాముల ఒక లీటీరు నీటికి కలిపి పంటపై పిచికారిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో నవ్య పాల్గొన్నారు.

జడ్పీటీసీ రిజర్వేషన్లు ఇలా..		
	2019లో	ప్రస్తుతం
ఎస్టీ జనరల్ :	కామేపల్లి , సింగరేణి	కూసుమంచి, కొణిజర్ల
ఎస్టీ మహిళ :	రఘునాధపాలెం, ఏన్కూరు	తిరుమలాయపాలెం, సత్తుపల్లి
ఎస్సీజనరల్ :	బోనకల్, మధిర	ఎర్రుపాలెం, ముదిగొండ
ఎస్సీ మహిళ :	వేంసూరు, వైరా	కల్లూరు, తల్లాడ
బీసీజనరల్ :	చింతకాని	వైరా, నేలకొండపల్లి, వేంసూరు, రఘునాదపాలెం
బీసీ మహిళ :	ముదిగొండ	బోనకల్, ఖమ్మంరూరల్, పెనుబల్లి, మధిర
జనరల్ :	తిరుమలాయపాలెం, సత్తుపల్లి, కల్లూరు, పెనుబల్లి, ఖమ్మంరూరల్	చింతకాని, ఏన్కూరు,
జనరల్ మహిళ :	కొణిజర్ల, ఎర్రుపాలెం, తల్లాడ, నేలకొండపల్లి, కూసుమంచి	కామేపల్లి, సింగరేణి
మండల ప్రజా పరిషత్ చైర్మన్లు రిజర్వేషన్లు		
ఎస్టీజనరల్ :	కూసుమంచి, ఏన్కూరు, తిరుమలాయపాలెం,	సత్తుపల్లి, పెనుబల్లి, కామేపల్లి
ఎస్టీ మహిళ :	రఘునాధపాలెం, సింగరేణి, కామేపల్లి	కొణిజర్ల, ఏన్కూరు
ఎస్సీ జనరల్ :	వేంసూరు, కల్లూరు, ఎర్రుపాలెం	ముదిగొండ, చింతకాని,
ఎస్సీ మహిళ :	మధిర, వైరా, బోనకల్	తల్లాడ, తిరుమలాయపాలెం
బీసీ జనరల్	-----------	బోనకల్, ఖమ్మంరూరల్, వైరా, నేలకొండపల్లి,
బీసీ మహిళ	-----------	వేంసూరు, మధిర, కూసుమంచి, కల్లూరు,
జనరల్ :	కొణిజర్ల, ముదిగొండ, తల్లాడ, చింతకాని	రఘునాథపాలెం, సింగరేణి,
జనరల్ మహిళ :	సత్తుపల్లి, పెనుబల్లి, ఖమ్మంరూరల్, నేలకొండపల్లి	ఎర్రుపాలెం

అర్హులకు ఇళ్లు ఇవ్వాలని సీపీఎం ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న పేదలు

మధిర రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ శనివారం మధిరలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు శీలం నర్సింహారావు, మందా సైదులు మాట్లాడారు. మధిర మండలంలో పెద్ద ఎత్తున పొలాలున్న వారికి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కుటుంబాలకు ఇళ్ల జాబితాలో చోటు కల్పించారని ఆరోపించారు. మధిర ఎంపీడీవో అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించారని, ఎంపీడీవోను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కమిటీలను రద్దుచేయాలని కోరారు. అసలే గూడు లేని నిరుపేదలు చాలామంది ఉన్నారని, గ్రామాల్లో వారికి ఇళ్లు మంజూరు కాకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఎంపీడీవో కార్యాలయం ముందు బైఠాయించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు పాపినేని రాంనర్సయ్య, మద్దాల ప్రభాకర్, వూట్ల శంకర్‌రావు, టి.రాధాకృష్ణ, లాలూ, అమరయ్య, వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

సెమిస్టర్‌లో మదర్‌థెరిస్సా విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 2024-25విద్యా సంవత్సరంలో జూలైలో మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో అటానమస్ హోదాలో నిర్వహించిన బీటెక్ మొదటి సంవత్సరం 2వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ డా.చలసాని హరికృష్ణ తెలిపారు. శనివారం కళాశాలలో ఫలితాలను విడుదల చేయగా సీఎస్‌ఎంలలో పగిడిపల్లి సెరేనా రోసిలిన్, రాపోలు నాగహిందుమతి, సూరనేని అఖిల, సీఎస్సీలో అంబటి సత్యశ్రీ, మేకల ప్రవల్లిక, దారబోయిన సాయిదీప్తి, నల్లమాటి హర్షిత, ఈసీఈలో నాయుడు రుచిత, గుడె యామిని, రాజబోయిన సుప్రియ, ఈఈఈలో మహ్మద్ సమ్‌రామ్‌మహేక్, అలవాల భావనశ్రీ, పురం గాయిత్రి, సివిల్ ఇంజనీరింగ్‌లో సయ్యద్ రహిల్‌తోపాటు మరో 64మంది విద్యార్థులు ఆయా సబ్జెక్టులలో 10/10గ్రేడ్ పాయింట్లు సాధించారన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యన్నారాయణ, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డా.ఎంవీ.రామచంద్రరావు అభినందించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

- వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



గన్నవరంలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

వైరా, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతునివ్వాలని కోరారు. మండలంలోని గొల్లెనపాడు గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.1.09కోట్లతో నిర్మించే సీసీ రోడ్లకు, గన్నవరం గ్రామంలో డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించే సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం వైరా మునిసిపాలిటీ పరిధిలో రిజర్వాయర్ రోడ్డులో రూ.90లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డుపైన సెంట్రల్ లైట్లను స్విచ్చాన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో ఎమ్మెల్యేకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. అన్నిచోట్ల జరిగిన సభల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 20నెలల కాలంలోనే అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిర్వహించామని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు పుష్కలంగా అందుతున్నాయని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నివర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతు ఇచ్చి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఉండటం ద్వారా అభివృద్ధి, సంక్షేమాన్ని మరింత వేగవంతం చేయవచ్చునని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు నూతి సత్యనారాయణ, కట్ల రంగారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు బీడీకే.రత్నం, శ్రీరామనేని తిరుపతిరావు, పణితి సైదులు, తేళ్లూరి వీరయ్య, ధార్న రాజశేఖర్, పమ్మి అశోక్, అయిలూరి కోటిరెడ్డి, శ్రీనివాసరావు, వన్నపరపు ఏడుకొండలు, వేల్పుల మురళీ, రాధాకృష్ణ, జవ్వాజి నాగరాజు, బోళ్ల గంగారావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సీపీఎం సిద్ధం

వైరా, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతున్న కమ్యూనిస్టులను స్థానిక ఎన్నికల్లో ప్రజలు గెలిపించాలని, ఈ ఎన్నికలకు సీపీఎం సిద్ధంగా ఉందని డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం తెలిపారు. తోట నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం జరిగిన సీపీఎం కార్యకర్తల సమావేశంలో వీరభద్రం మాట్లాడారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడం వలన గ్రామాల్లో పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నాయని విమర్శించారు. సీపీఎం శ్రేణులు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నాయకులు తాళ్లపల్లి కృష్ణ పాల్గొన్నారు.

భద్రత లేక కూపన్ల పంపిణీ వాయిదా

- నిరాశతో వెనుదిరిగిన రైతులు, సీఈవోలపై తీవ్ర వత్తిడి

కల్లూరు, సెప్టెంబరు27 (ఆంధ్రజ్యోతి) యూరియా కోసం వస్తే పంపిణీ కేంద్రం వద్ద పోలీసుల భద్రత లేకపోవడంతో రైతుల మధ్య తోపులాట జరగింది. దీంతో వ్యవసాయ శాఖ తరుపున కూపన్ల పంపిణీ చేయటం పెద్ద సమస్యగా మారింది. ఇలా కల్లూరు మండలంలోని పోచవరం గ్రామంలోని ప్రాథమిక సహకార సంఘం కేంద్రం వద్ద శనివారం కూపన్లు పంపిణీ ఉందని తెల్లవారు జామున 4 గంటల నుంచి పలు గ్రామాల రైతులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఉదయం 7 గంటలకు సొసైటీ కార్యాలయం వద్ద అధికారులు రైతులకు కూపన్లు పంపిణీ చేద్దామని సిద్ధం కాగా క్యూలో నిలిచిన రైతులు తోపులాడు కోవటంతో అధికారులు ఏమి చేయలేని పరిస్థితి. ఈ సొసైటీకి గాను శనివారం 355 బస్తాల యూరియా స్టాక్ రాగా, కూపన్ల కోసం మాత్రం 700 మంది రైతులు పలు గ్రామాల నుంచి భారీగా తరలి రావటంతో అధికారులు ఖంగుతిన్నారు. మరో వైపున కల్లూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్థానిక ఎన్నికల రిజర్వేషన్ల ప్రకియకు పోలీసుల భద్రత ఏర్పాటు చేయటంతో ఈ పరిస్థితి సొసైటీ కార్యాలయం వద్ద ఏర్పడింది.

గుండెపోటుతో రిటైర్డ్ జడ్జి కన్నుమూత

బోనకల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మాదినేని నారాయణ రెండవ కుమారుడు రిటైర్డ్ జడ్జి రాధాకృష్ణ(67) శనివారం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గతంలో మధిర, వికారబాద్, నాంపల్లి స్టేషన్ కోర్టుల్లో జడ్జిగా పని చేశారు. హైదరాబాద్, వికారాబాద్ కన్స్యూమర్ కోర్టులో న్యాయ సేవలను అందించారు.

నేడు బోనకల్‌లో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

బోనకల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటన షెడ్యూల్ ఖరారైంది. సోమవారం సాయంత్రం 3:30 గ ంటలకు, నారాయణపురంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. అధికారులతో నిర్వహించే సమావేశాల్లో పాల్గొని రాత్రి 8గంటలకు మధిరకు వెళ్లనున్నారు.

208వార్డుల మహిళా రిజర్వేషన్లకు డ్రా

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మహిళా రిజర్వేషన్లను డ్రా పద్ధతిలో ఎంపిక చేసినట్లు ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని 21గ్రామ పంచాయితీలలోని 208వార్డులకుగానూ మహిళా రిజర్వేషన్లను ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో డ్రా ద్వారా ఎంపిక చేశారు.తహసీల్దార్ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ శివ, అధికారులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా..బతుకమ్మ వేడుకలు

శనివారం బతుకమ్మ సంబరాలను పలు ప్రాంతాల్లో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండగ మహిళల ఐక్యత, ప్రకృతి పూజ, తల్లి ఆరాధనకు ప్రతీక అని సత్తుపల్లి ఆర్టీసీ డీఎం ఊటుకూరి సునీత అన్నారు. అలాగే ఐసీడీఎస్ పెనుబల్లి సెక్టార్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.



సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో బతుకమ్మ సంబరాలు



ముదిగొండలో బతుకమ్మలతో వైద్యసిబ్బంది



విజయ ఇంజనీరింగ్ కళాశాలలో బతుకమ్మ వేడుకల దృశ్యం



పెనుబల్లిలో బతుకమ్మలాడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు